ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
సోమవారం 11 మార్చి 2024

రైల్వేకోడూరు పట్టణంలో చీరలను పంచుతున్న వైసీపీ కార్యకర్తలు, పక్కనే ఉన్న వలంటీరు



రైల్వేకోడూరులో ఆగని చీరల పంపిణీ

● వైసీపీ నేతలతో కలిసి వెళుతున్న వలంటీర్లు

రైల్వేకోడూరు, మార్చి 10: మండలంలో వైసీపీ నేతల చీరల పంపిణీ కార్యక్రమం నిరంతరాయంగా కొనసాగుతోంది. ఆదివారం ఉదయం నుంచే ఈ కార్యక్రమాన్ని వైసీపీ శ్రేణులు ప్రారంభించారు. వలంటీర్లను ఒత్తిడి చేసి వైసీపీ నేతలు తమ వెంట తీసుకెళ్లి చీరలు పంపిణీ చేస్తున్నారు. ఇదిలా ఉండగా చీరలు ఇచ్చిన ఇంటి వద్ద మీకు జగన్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అందిస్తోందని, జగన్ అన్న చీరలను పంపించాడని, ఎన్నికల్లో వైసీపీకి ఓట్లు వేయాలని ప్రచారం చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఇదే తంతు మరింత ఎక్కువగా సాగుతోంది. ఎన్నికల కోడ్ వస్తుందని చీరలను బ్యాగుల్లో పెట్టి ప్రతి ఇంటికీ ఇస్తున్నారు. ఎన్నికల్లో మరిన్ని తాయిలాలు ఇస్తామని వైసీపీ క్యాడర్ ప్రజలను మభ్యపెడుతూ ప్రచారం చేస్తున్నారు. కొందరు మహిళలు చీరలను విసిరి పారేస్తున్నారు. ఓట్లు నచ్చిన వాళ్లకు వేసుకుంటామని ముఖం పైనే వైసీపీ క్యాడర్‌కు చెబుతున్నారు. రైల్వేకోడూరు, పెనగలూరు, చిట్వేలి, పుల్లంపేట, ఓబులవారిపల్లె మండలాల్లో ముమ్మరంగా వైసీపీ చీరలను ప్రజలకు పంచుతున్నారు. ఎన్నికల కోడ్ త్వరగా వస్తే తప్ప ఏమీ చేయలేని స్థితిలో అధికారులు ఉన్నారు.

కన్నుల పండువగా త్రేతేశ్వరస్వామి రథోత్సవం



రాజంపేటటౌన్, మార్చి 10: జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన రాజంపేట మండలం హత్యరాల త్రేతేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదివారం రథోత్సవం కన్నుల పండువగా జరిగింది. వేలాదిమంది భక్తుల శివన్నామస్మరణ మధ్య రథాన్ని హత్యరాల పురవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్దఎత్తున పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రాజంపేట, పెనగలూరు, నందలూరు, చిట్వేలి, చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పెద్దఎత్తున భక్తులు హాజరయ్యారు. ఈ సందర్భంగా స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు.

టీడీపీ, జనసేన, బీజేపీ కలయిక చారిత్రాత్మకం

● టీడీపీ కడప జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి

కడప (ఎడ్యుకేషన్), మార్చి 10: టీడీపీ, జనసేన, బీజేపీ కలయిక చారిత్రాత్మకమని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. వైసీపీ నిరంకుశ పాలన తుదముట్టించేందుకు కలిసి పోటీ చేస్తున్నట్లు స్పష్టం చేశారు. ఆదివారం కడప నగరం టీడీపీ నియోజకవర్గం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి పార్టీ సభ్యులుగా అందరూ స్వాగతిస్తున్నమని స్పష్టం చేశారు. రాష్ట్రంలో నెలకొన్న క్లిష్ట పరిస్థితుల వల్ల అధినేత చంద్రబాబు పొత్తు నిర్ణయం తీసుకున్నారన్నారు. జగన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలోకి నెట్టబడిందన్నారు. అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా రాష్ట్రాన్ని మార్చివేశారని తెలిపారు. ఈ ప్రభుత్వంలో కులంతో సంబంధం లేకండా బీసీ, ఎస్సీ, ఎస్టీలపై దాడులు పెరిగిపోయాయని మండిపడ్డారు. వైసీపీ పాలనలో ప్రభుత్వమంటే కేవలం జగన్‌రెడ్డి, విజయసాయిరెడ్డి, సజ్జల రామక్రిష్ణారెడ్డి, ధనుంజయరెడ్డిగా మారిందన్నారు. ఈ ప్రభుత్వంలో బీసీలను ఎంత హీనంగా చూశారో వైసీపీ బీసీ సెల్ అధ్యక్షుడు గంగా క్రిష్ణమూర్తి మాటల్లోనే స్పష్టమైందని తెలిపారు. బీసీలకు టీడీపీ పుట్టినిల్లులాంటిదని జయహో బీసీ కార్యక్రమం ద్వారా మరోసారి రుజువైందన్నారు. ఇంత అరాచక జగన్‌రెడ్డి ప్రభుత్వాన్ని గద్దె దింపేందుకు మూడు పార్టీలు కలిసి వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తున్నాయని స్పష్టం చేశారు.

మదనపల్లె మున్సిపాలిటీలో పేద, మధ్యతరగతి ప్రజల కలలను సాకారం చేస్తూ గత ప్రభుత్వం మంజూరు చేసి, తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిన బహుళ అంతస్థుల నిర్మాణ పథకానికి చెల్లించిన వాటా సొమ్ము కోసం బాధితులు ఎదురు చూస్తున్నారు. రోజులు కాదు.. నెలలు కాదు.. నాలుగేళ్లుగా నిరీక్షిస్తున్నారు. ఇల్లు అయితే ఇవ్వకపోయారు కానీ.. తాము చెల్లించిన సొమ్ములు వెనక్కి ఇవ్వాలంటూ అటు పాలకులు, ఇటు అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. వడ్డీలకు అప్పులు చేసి ఇంటి కోసం డీడీ రూపంలో చెల్లించిన వాటా సొమ్మును ప్రభుత్వం తన ఖాతాలో వేసుకుని వడ్డీ తీసుకుంటుండగా, తాము మాత్రం చేసిన అప్పులకు వడ్డీలు చెల్లిస్తున్నామని లబ్ధిదారులు వాపోతున్నారు. ఇలా మదనపల్లె మున్సిపాలిటీలోనే రెండు, మూడు కేటగిరీలోని 1709 మందికి రూ.3.09 కోట్లకుపైగా బకాయిలు చెల్లించాల్సి ఉంది.

● టిడ్కో బాధితుల ఎదురుచూపు
● లబ్ధిదారుల బకాయిలు రూ.3.09 కోట్లు
● డబ్బుల కోసం నాలుగేళ్లుగా నిరీక్షణ



లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేసిన కేటగిరీ-1 గృహాలు

ఆ సొమ్ములెప్పుడిస్తారు?

మదనపల్లె, మార్చి 10: మదనపల్లె మున్సిపాలిటీలో పేద, మధ్యతరగతి ప్రజల సొంతింటి కల సాకారానికి అప్పటి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా పట్టణ మౌలిక సదుపాయాల కల్పన సంస్థ (టిడ్కో) బహుళ అంతస్థుల పథకానికి రూపకల్పన చేసింది. ఇందులో భాగంగా మదనపల్లె-తిరుపతి జాతీయ రహదారి పక్కన శానిటోరియం సమీపంలోని వెంకప్పకోట రెవెన్యూ గ్రామంలోని 36 ఎకరాల్లో మూడు విభాగాల్లో నిర్మాణం మొదలుపెట్టారు. జీప్లస్-3 నమూనాలో అపార్ట్‌మెంట్స్ నిర్మించి ఆన్‌లైన్ పద్ధతిలో లబ్ధిదారులకు కేటాయించాల్సి ఉంది. మున్సిపాలిటీకి 2018లో రెండో విడతలో ఈ పథకం మంజూరైంది. ఇందులో అర్హులైన లబ్ధిదారులకు 3,773 ఫ్లాట్లు కేటాయించగా, అందులో 3,560 ఫ్లాట్లకు ప్రభుత్వం నుంచి అనుమతి లభించింది. ఆ తర్వాత అప్పట్లో మున్సిపల్ కమిషనర్ పేరు మీద కేటగిరి-1లో 300 చ.అ. విస్తీర్ణానికి లబ్ధిదారుడి వాటాగా ఒకేసారి రూ.500, కేటగిరి-2లోని 365 చ.అ.విస్తీర్ణానికి రూ.12,500, కేటగిరి-3లోని 430 చ.అ. విస్తీర్ణానికి రూ.25 వేలు డీడీలు చెల్లించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో పాటు లబ్ధిదారుని వాటా సొమ్మునే డీడీ రూపంలో

అనుమతి రాగానే ఇస్తాం..

అపార్ట్‌మెంట్లు రద్దయిన లబ్ధిదారులకు వారు చెల్లించిన డబ్బులు చెల్లించే అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. వారు చెల్లించిన సొమ్ములు బ్యాంకు ఖాతాలో ఉన్నాయి. అనుమతి రాగానే కేటగిరీల వారీగా లబ్ధిదారులకు అందజేస్తాం. కేటగిరీ-2, కేటగిరీ-3లో ఫ్లాటు రద్దయిన వారికి తర్వాత నవరత్నాలు..పేదలందరికీ ఇళ్ల పథకంలో అవకాశం కల్పిస్తున్నాం. దరఖాస్తు సమయంలో ఇబ్బందులు ఎదురైనా వాటిని అధిగమించాం. దరఖాస్తుకు అందరికీ అవకాశం కల్పించాం. వీరి పేర్లను ఆన్‌లైన్‌లో తొలగించడంతో సమస్య పరిష్కారమైంది. అర్హులైన వీరందరికీ జగనన్న లేఔట్లలో స్థలంతో పాటు పక్కాఇల్లు మంజూరు చేస్తున్నాం.

- కె.ప్రమీల, మున్సిపల్ కమిషనర్, మదనపల్లె



పునాది దశలో ఆగిన కేటగిరీ-2 టిడ్కో ఇళ్లు

చెల్లించారు. మొదటి కేటగిరిలోని 300 చ.అ. నిర్మాణానికి ఒకేసారి రూ.500 చెల్లిస్తే, రెండో కేటగిరీకి లబ్ధిదారుడు చెల్లించాల్సిన రూ.50 వేలను రూ.12,500 చొప్పున నాలుగు విడతల్లో, మూడో కేటగిరీకి లక్ష రూపాయలను రూ.25 వేల చొప్పున నాలుగు విడతల్లో చెల్లించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో పథకం ప్రారంభంలో లబ్ధిదారులు మొదటి విడతగా చెల్లించాల్సిన రూ.500, రూ.12,500, రూ.25 వేలను చెల్లించారు. వీరిలో రెండో కేటగిరిలో 957 మంది రూ.12,500 చొప్పున రూ.1.20 కోట్లు, మూడో కేటగిరిలో 752 మంది రూ.25 వేలు చొప్పున రూ.1.90 కోట్లు చెల్లించారు. మొదటి కేటగిరీలో 1,872 మంది రూ.500 చొప్పున చెల్లించగా, వీటిని లబ్ధిదారుల పేరిట ఇదివరకే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి కాగా నాలుగురోజుల క్రితం ఆ పత్రాలతో పాటు ఇంటి తాళాలను లబ్ధిదారులకు అందజేశారు.

2019 అసెంబ్లీ ఎన్నికలు రావడంతో నిర్మాణాలు మందగించాయి. తర్వాత ప్రభుత్వం కూడా మారిపోయింది. దీంతో బహుళ అంతస్థుల పథకమే అటకెక్కింది. టీడీపీ ప్రభుత్వంలో చేపట్టిన ఈ పనుల్లో అక్రమాలు జరిగాయంటూ జగన్ ప్రభుత్వం రివర్స్ టెండరింగ్ విధానాన్ని అమలు చేయడంతో పాటు రెండు, మూడు కేటగిరీల నిర్మాణాలను రద్దు చేసింది. దీంతో ఈ పథకమూ అప్పటి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 2005లో మదనపల్లెలో చేపట్టిన మరో రాజీవ్ గృహకల్ప పథకం జాబితాలో చేరింది. ఇదిలా వుండగా టిడ్కో పథకంలోని మూడు విభాగాల్లో మొదటిదైన 300 చ.అ. విస్తీర్ణాన్ని మాత్రం కొనసాగించింది. 1872 మందికిగాను, 1706 మంది పేరున నివాసాలకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసి లబ్ధిదారులకు తాళాలు అందజేశారు. ఇక నిర్మాణం చేపట్టిన గృహాల్లో 106 మందిలో కొందరు చనిపోవడం, వారసత్వ సమస్య, మరికొందరు స్థానికంగా లేకపోవడం, చిరునామాలు చిక్కకపోవడం, తదితర కారణాలతో పెండింగ్‌లో ఉన్నాయి. కానీ రెండు, మూడు కేటగిరీల లబ్ధిదారులు సొమ్ములు చెల్లించినా చివరకు నిరాశే మిగిలింది. రద్దు చేస్తే పోనీగానీ, మేం చెల్లించిన డబ్బులు వాపస్ ఇవ్వమని బాధితులు నాలుగేళ్లుగా కాళ్లరిగేలా తిరుగుతున్నా ప్రయోజనం లేదు. ఇక్కడ టిడ్కోలో పేరు నమోదు చేసుకున్న లబ్ధిదారులకు జగనన్న పథకంలోనూ మొదట్లో ఇల్లు మంజూరు కాలేదు. ఇప్పటికే ఇల్లు వచ్చినట్లు ఆన్‌లైన్‌లో చూపించేది. తర్వాత వాటిని ఆన్‌లైన్‌లో ప్రభుత్వం తొలగించడంతో నవరత్నాలు-పేదలకందరికీ ఇళ్ల పథకంలో అర్హత వచ్చింది. దీంతో వీరిలో కొందరికి వ్యక్తిగత నివాసాల కింద జగనన్న లేఔవుట్లలో పట్టాతో పాటు పక్కా ఇల్లు మంజూరు కాగా మిగిలిన వారూ అదే పథకానికి దరఖాస్తు చేసుకుంటున్నారు.

అప్పు చేసి మరీ రూ.25 వేలు చెల్లించా..



పట్టణంలోని ఇంటి బాడుగ రూ.7 వేలు చెల్లించలేక ఊరికి దూరమైనా టిడ్కో పథకం కింద 430 చ.అ.విస్తీర్ణంలో అపార్టుమెంట్‌కు దరఖాస్తు చేసుకున్నా. అందుకోసం రూ.25 వేలు వడ్డీకి అప్పు తెచ్చి బ్యాంకులో డీడీ తీసి మున్సిపల్ కార్యాలయంలో అందజేశాం. అయితే అక్కడ అపార్ట్‌మెంట్ వస్తుందని, ఇక్కడ జగనన్న ఇంటికి కూడా దరఖాస్తు చేసుకోలేదు. దానిని నమ్ముకుని, లేఔట్‌లో ఇచ్చే ఇల్లు వద్దనుకున్నాం. తీరా చూస్తే రెండూ రాలేదు. నేను చెల్లించిన డబ్బులైనా వెనక్కి వస్తే చాలు. నాలుగేళ్లపైబడి తిరుగుతున్నా వస్తుంది.. ఇస్తాం అని చెబుతున్నారు.

- ఎ.రవికుమార్, గొల్లపల్లె, మదనపల్లె

ఆశగా దరఖాస్తు చేస్తే నిరాశే..



అపార్ట్‌మెంట్‌లో ఫ్లాటు వస్తుందని ఎంతో ఆశతో దరఖాస్తు చేస్తే చివరకు నిరాశే ఎదురైంది. నాకు 365 చ.అ.విస్తీర్ణంలో ఇల్లు మంజూరైందని అధికారులు చెప్పారు. నా వాటా కింద రూ.50 వేలు చెల్లించమని చెప్పడంతో మొదటి విడతగా అప్పు చేసి రూ.12,500 చెల్లించాను. తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఆ ఇళ్లను రద్దు చేసిందని హౌసింగ్ అధికారులు చెప్పారు. ఆరు నెలల్లో కట్టిన డబ్బు వెనక్కి వస్తుందని చెప్పారు. ఇప్పటికి నాలుగేళ్లయినా ఆ ఊసే లేదు. మున్సిపల్, హౌసింగ్ ఆఫీసులకు వెళితే ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే ఇచ్చేస్తామంటున్నారు. ఇల్లు రద్దయిన నాలాంటి వారంతా తిరుగుతూనే ఉన్నాం.

- ఎస్.నరసింహులు, రామారావుకాలనీ, మదనపల్లె

రాష్ట్రాభివృద్ధికే బీజేపీతో కలయిక

● చంద్రబాబు హయాంలోనే మైనార్టీలకు సంక్షేమ పథకాలు ● రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు



సమావేశంలో మాట్లాడుతున్న రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు

రాయచోటిటౌన్, మార్చి 10: అభివృద్ధి కోసమే టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు బీజేపీతో కలిశారని రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు తెలిపారు. ఆదివారం ఆయన రాయచోటి పట్టణంలో మీడియాతో మాట్లాడుతూ వైసీపీ విధ్వంసక ప్రభుత్వాన్ని గద్దె దింపేందుకే మూడు పార్టీల కలయిక జరిగిందన్నారు. 2024 ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీల కలయిక చారిత్రాత్మకమైందన్నారు. తెలుగుదేశం, జనసేన, బీజేపీల కూటమిని పార్టీ కుటుంబ సభ్యులుగా మేము అందరం స్వాగతిస్తున్నామన్నారు. చంద్రబాబు గతంలో కూడా మైనార్టీ వర్గాల సంక్షేమం కోసం ఎన్నో పథకాలు తీసుకొచ్చారన్నారు. రాష్ట్రంలో నెలకొన్న క్లిష్ట పరిస్థితుల ఆధారంగా అధినేత చంద్రబాబునాయుడు పొత్తు నిర్ణయం తీసుకున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సంక్షేమం, అభివృద్ధి కోసమే చంద్రబాబు బీజేపీతో పొత్తుకెళ్లారని, వచ్చే ఎన్నికల్లో కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడుతుందని, తద్వారా రాష్ట్ర ప్రయోజనాలు సాధించుకోవడానికి వీలవుతుందన్నారు. 2014లో బీజేపీతో పొత్తు ఉన్నప్పటికీ చంద్రబాబు సారధ్యంలో అన్ని వర్గాల వారికి సంక్షేమ అభివృద్ధి పథకాలు అందాయన్నారు. వైసీపీ ప్రభుత్వం ఓట్లు వేసిన అన్ని వర్గాలను నిర్లక్ష్యం చేసి వారిపైనే దాడులు చేసి రాష్ట్రంలో విధ్వంసక పరిపాలన సాగిస్తున్నారని ఆరోపించారు. చంద్రబాబు నాయకత్వంలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం తెలుగుదేశం పార్టీ సంకల్పించిన మహాయజ్ఞానికి జనసేనతో పాటు బీజేపీ కూడా కలిసి వచ్చిందన్నారు. అరాచక వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకే మూడు పార్టీలు కలిసికట్టుగా వచ్చే ఎన్నికల్లో పోటీ చేయనున్నాయని చెప్పారు. తెలుగుదేశం పార్టీపై కేంద్రంలో ఉన్న బీజేపీ పెద్దలకు కూడా నమ్మకం కలిగిందన్నారు. అందుకే కేంద్రం పొత్తులకు ఆహ్వానించిందని తెలిపారు. తెలుగు ప్రజల కోసం, ఆంధ్రప్రదేశ్ అభ్యున్నతి కోసం తెలుగుదేశం పార్టీ సంకల్పించిన మహాయజ్ఞానికి ఇటు జనసేనతో పాటు, అటు బీజేపీ కూడా కలిసి వస్తోందన్నారు. చంద్రబాబు దార్శనిక పాలన ఆంధ్రప్రదేశ్ ప్రజలకు రక్షగా ఉంటుందని, అతిపెద్ద జాతీయ పార్టీతో పాటు దేశం మొత్తం టీడీపీకి మద్దతిస్తోందని తెలిపారు.

సమావేశంలో మైనార్టీ నాయకులు ముస్తాక్‌హుస్సేన్, గోరాన్‌చెరువు మాజీ సర్పంచ్ శ్రీనివాసరాజు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవోపేతం వీరభద్రుడి బ్రహ్మోత్సవం

● ఘనంగా చండీహోమం, శేష వాహనోత్సవం

రాయచోటిటౌన్, మార్చి 10: రాయచోటి పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం చండీహోమాన్ని ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి హోమంలో పాల్గొని వీరభద్రుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతర వీరభద్రుడు, భద్రకాళీ అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలు, వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి శేషవాహనంపై పట్టణ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. శేష వాహనం సందర్భంగా టీటీడీ ధర్మప్రచార పరిషత్ వారిచే నిర్వహించిన కోలాటం భక్తులను అలరించింది. అలాగే రాత్రికి వీరభద్రుడు పూలంగి సేవలో పులకించాడు. చంద్రప్రభ వాహనంపై ఊరేగి భక్తులకు దర్శనమిచ్చారు. వాహన ఊరేగింపు సందర్భంగా శ్రీవీరభద్ర స్వామి భజన మండలి తుమ్మల హరినాథ్ ఆధ్వర్యంలో కోలాటం భక్తులను ఆకట్టుకుంది.

వాహనాల ఊరేగింపు సందర్భంగా పట్టణ భక్తులతో పాటు కన్నడ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.





శేష వాహనంపై ఊరేగుతున్న భద్రకాళీ సమేత వీరభద్రుడు.. వీరభద్రాలయంలో చండీహోమం నిర్వహిస్తున్న దృశ్యం

కట్ట పునర్నిర్మాణమెప్పుడో?

- రెండున్నరేళ్లయినా పట్టించుకోని పాలకులు
- అన్నమయ్య డ్యాం తెగినప్పుడు పెనగలూరు చెరువు సర్వనాశనం
- బీళ్లుగా మారిన 1100 ఎకరాల ఆయకట్టు
- ఉపాధి కోల్పోయిన వేలాది మంది రైతులు, కూలీలు


నీరు లేక నిరుపయోగంగా దర్శనమిస్తున్న పెనగలూరు చెరువు

పెనగలూరు, మార్చి 10: రెండున్నరేళ్ల కిందట అన్నమయ్య ప్రాజెక్టు తెగిపోయినప్పుడు పెనగలూరు చెరువుకు గండ్లు పడి చెరువు కట్ట కొట్టుకుపోయింది. అప్పటి నుంచి పాలకులు దాని గురించి పట్టించుకున్న పాపాన పోలేదని గ్రామస్థులు, రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆయకట్టు రైతులు గానీ, ప్రతిపక్ష పార్టీ వారు గానీ ఈ రెండున్నరేళ్లలో అధికార పార్టీ పాలకులను ప్రశ్నించిన పాపాన పోలేదు. ప్రశ్నిస్తే కేసులు పెట్టి ఇబ్బందులకు గురి చేస్తారేమోనని భయంతో ఎవరూ దీని గురించి మాట్లాడటం లేదని తెలిసింది. భారీ వరద నీటి వల్ల 2021 నవంబరు 19న అన్నమయ్య ప్రాజెక్టు తెగిపోవడంతో చెయ్యేటిలో ప్రళయంలా ప్రవహించిన వరద నీరు పెనగలూరు చెరువుపై పడింది. చెరువులో అప్పటికే సగం నీరుండటంతో ప్రళయంలా వచ్చిపడుతున్న అన్నమయ్య నీటితో గంటల వ్యవధిలోనే చెరువు నిండిపోయింది. దీంతో చెరువు కట్టకు నాలుగుచోట్ల పెద్దగండ్లు పడటంతో వరద నీరంతా ఆయకట్టు ద్వారా గుంజనేటిపై పడింది. పెనగలూరు చెరువు చరిత్రలో ఎన్నడూ జరగనంత ఘోరంగా నాలుగు చోట్ల భారీ గండ్లు పడ్డాయి. ఈ భారీ గండ్ల కారణంగానే చెరువులోని నీరంతా వెళ్లిపోయింది. ఇదిలా ఉండగా ఈ సంఘటనతో చెరువు తరువాత ఉన్న కోడిచెన్నయ్యగారిపల్లె, పల్లంపాడు, నర్సింగరాజపురం, యారాచపల్లె గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మూడు రోజుల తరువాత ఈ గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి వచ్చే ప్రయత్నాలు చేయగా నాలుగు చోట్ల పడ్డ గండ్ల కారణంగా ధ్వంసమైన కట్టపై వచ్చే వీలు కలగలేదు. ఆయా గ్రామ పెద్దలు యువత కలగజేసుకుని చెరువులోపలి భాగంలోనే కంపచెట్లను తొలగించి గండ్లు పడ్డ నాలుగు చోట్ల దారి ఏర్పరచుకున్నారు. స్థానిక నాయకులు, ఎమ్మెల్యే, ఎంపీ, అధికారులతో కలిసి కట్టను పరిశీలించి తాత్కాలిక మరమ్మతుల కోసం 80 లక్షల రూపాయలు మంజూరు చేయించారు. ఆ నిధులతో వాహనాల రాకపోకలకనుగుణంగా కట్టపై పడ్డ గండ్లను కొంత మేర పూడ్చి వేశారు. నాటి నుంచి నేటి వరకు ఈ కట్ట రాకపోకలకు మాత్రమే ఉపయోగపడుతోంది తప్ప చెరువులో నీటి నిల్వకు ఉపయోగపడటం లేదు. రెండున్నరేళ్ల నుంచి చెరువులో నీరు లేనందువలన అంతర్భాగంలో దట్టంగా కంపచెట్లు పెరిగిపోతున్నాయి. పశువులు గ్రాసం మేసేందుకు కూడా పనికి రాకుండాపోతోంది. అలాగే ఆయకట్టులో కూడా పంటల సాగు లేకపోవడంతో పొలాలన్నీ కంపచెట్లతో దర్శనమిస్తున్నాయి. రెండున్నరేళ్లుగా 1100 ఎకరాలు నిరుపయోగమైపోయాయి. ఫలితంగా వందలాది మంది రైతులు, రైతు కూలీలు ఉపాధి కోల్పోయారు. ఒక్కసారి ఈ చెరువు నిండితే రబీలోనూ, ఖరీఫ్‌లోనూ రెండుసార్లు పంట చేతికొస్తుంది. ఈ చెరువు కింద 8 గ్రామాల ప్రజలకు భూములుండగా ఆరు గ్రామ పంచాయతీల నుంచి వ్యవసాయ కూలీలు ఉపాధి పొందుతుంటారు. చెరువు తెగిపోయినప్పుడు స్థానిక నాయకులతో పాటు ఎమ్మెల్యే, ఎంపీ పరిశీలించారు. మరుసటి వారంలోనే ఆర్‌అండ్‌బీ ముఖ్య కార్యదర్శి కృష్ణబాబు కూడా పరిశీలించారు. కట్టపై పడ్డ నాలుగు గండ్లు శాశ్వత ప్రాతిపదికన మరమ్మతులు చేసేందుకు జల వనరుల శాఖ రూ.6 కోట్లతో ప్రతిపాదనలు పంపినట్లు ఆ శాఖ సిబ్బంది తెలిపారు. అలాగే పెనగలూరు నుంచి కోడి చిన్నయ్యగారిపల్లె వరకు కట్టపైన తారురోడ్డు నిర్మించేందుకు కృష్ణబాబు ప్రత్యేకంగా ఎస్టిమేట్ పంపించారని కూడా చెప్పారు. రెండున్నరేళ్లు కావస్తున్నా చెరువు కట్ట శాశ్వత మరమ్మతుల ఊసే కనిపించలేదు. మండలంలోనే అతిపెద్దదైన ఈ చెరువు ఒకసారి నిండితే చుట్టూ 20 గ్రామాలలోని బోర్లకు పుష్కలంగా నీరొచ్చి సాగు, తాగునీటికి కొరత లేకుండా ఉంటుంది. రెండున్నరేళ్లుగా చెరువు ఖాళీగా ఉండటంతో పరిసర గ్రామాలలో నీటి ఎద్దడి మొదలైంది. రాబోవు ఖరీఫ్ నాటికి ఫిల్టర్ పాయింట్లు, బోర్లు ఎండిపోతాయేమోనని రైతులు భావిస్తున్నారు. ఇదిలా ఉండగా జలవనరుల శాఖ ద్వారా కట్ట మరమ్మతుల కోసం పంపిన ఆరు కోట్ల అంచనాలు అన్ని గాలిపుకార్లేనని ప్రజలను నమ్మించడానికి అధికార పార్టీ నాయకులు చెబుతున్న మోసపూరిత మాటలేనని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు. ప్రభుత్వం మారితే తప్ప ఈ చెరువుకు మోక్షం కలగలేదని అనుకుంటున్నారు. ఈ చెరువుకు పూర్వవైభవం ఎప్పుడొస్తుందా అని మండల ప్రజలు ఎదురు చూస్తున్నారు. ఈ విషయంపై ఇరిగేషన్ డీఈని వివరణ కోరగా ఆయన స్పందించడం లేదు.

పశువులకు మేత దొరకడం కూడా గగనమైపోయింది..



చెరువులో నీరున్నపుడు ఆయకట్టులో పుష్కలంగా పశువులకు పచ్చి మేత లభిస్తుంది. పంటలు కోసిన తరువాత కూడా అదే పదునుతో పెద్ద పెసర, పిల్లిపెసర, అలసంద, మినుము తదితర వాటిని సాగు చేసి దానిని పశువుల మేతకోసమే వాడుతుంటాం. అదే సమయంలో వరిగడ్డిని వాములు తొక్కి ముందు రోజుల కోసం భద్రపరుస్తాం. చెరువులో నీరు ఎండిపోయినపుడు దాని అంతర్భాగంలో కూడా పచ్చిగ్రాసం బాగా దొరుకుతుంది. రెండున్నరేళ్లుగా చెరువు ఖాళీగా ఉండటంతో కనీసం పశువులకు గ్రాసం దొరకడం కూడా గగనమైపోయింది.

- కోడూరు పెద్ద నరసింహులు, పాడి రైతు, పెనగలూరు

రెండు పంటలకు ఢోకా ఉండదు..



పెనగలూరు చెరువు ఒకసారి నిండి అలుగు పారితే రెండు పంటలకు ఢోకా ఉండదు. రుతుపవనాల్లో సరిగ్గా వర్షాలు కురిసి అక్టోబరు, నవంబరు నెలల్లో చెరువులో నీటిని బట్టి రైతులు నార్లు పోసుకుంటారు. రబీలో వరి సాగు చేసినా ఖరీఫ్‌లో ఆరుతడి పంటైనా పండిస్తారు. చెరువులో నీరు లేకపోవడం వలన రెండున్నరేళ్లుగా ఆయకట్టు పశువులు మేతకోసం గ్రాసం పెంచుకునేందుకైనా నీరులేకపాయె.

- అంకాని సుబ్బనరసయ్య, ఆయకట్టు రైతు, పెనగలూరు


చిట్టడవిలా కనిపిస్తున్న ఆయకట్టు భూములు


కట్ట కొట్టుకుపోవడంతో నిరుపయోగంగా దర్శనమిస్తున్న తూము


కట్ట పక్కన పడ్డ పెద్ద గొయ్యి అలాగే ఉన్న దృశ్యం

కారు ఢీకొని స్కూటరిస్ట్ మృతి

మృతుడు టీటీడీ విజిలెన్స్ ఉద్యోగిగా గుర్తింపు


మృతి చెందిన శేషసాయికుమార్, స్కూటరిస్టు ఢీకొన్న కారు

రైల్వేకోడూరు, మార్చి 10: మండలంలోని అనంతరాజుపేట వద్ద కారు ఢీకొని స్కూటరిస్టు ఆదివారం మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. రైల్వేకోడూరు మండలంలోని అనంతరాజుపేట ప్రధాన దారిలో తిరుపతి నుంచి హైదరాబాద్‌కు వెళుతున్న కారు కడప వైపు నుంచి తిరుపతి వైపు వెళుతున్న స్కూటరిస్టును ఢీకొంది. దీంతో అక్కడికక్కడే ఆర్.శేషసాయికుమార్ (30) మృతి చెందాడు. మృతుడు టీటీడీ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ డిపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. సమాచారం తెలుసుకున్న రైల్వేకోడూరు సీఐ టి.బాబు తన సిబ్బందితో వెంటనే సంఘటనాస్థలానికి వెళ్లారు. కాగా మృతుడి కుమారుడు, కుమార్తె హైదరాబాద్‌లో ఉంటున్నారని, మృతుడి భార్య ఇటీవల చనిపోయిందని పోలీసులు తెలిపారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌కు వెళ్లిన మృతుడు శనివారం హైదరాబాద్ నుంచి తన మోటారు సైకిల్‌లో కర్నూలుకు వచ్చి అక్కడ ఉన్న తన చెల్లెలు ఇంటిలో ఉండి, ఆదివారం తెల్లవారుజామున మోటారు సైకిల్‌లో తిరుపతికి బయలుదేరాడు. అనంతరాజుపేట వద్ద కారు ఢీకొనడంతో చనిపోయాడు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం రాజంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రామాపురంలో వృద్ధుడు...


మృతి చెందిన నారాయణ

రామాపురం, మార్చి 10: కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారిలోని రామాపురం మండలం నల్లగుట్టపల్లె పంచాయతీ బీసీ కాలనీలో గల బ్రిక్స్ ఫ్యాక్టరీ సమీపంలో ఆదివారం కారు, స్కూటర్‌ను ఢీకొనడంతో స్కూటరిస్టు గునిశెట్టి నారాయణ (68) మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు... రాయచోటి పట్టణం మాసాపేట గ్రామం రెడ్డివారిపల్లెకు చెందిన బేల్దారి గునిశెట్టి నారాయణ మండలంలోని నల్లగుట్టపల్లె గ్రామం కొత్తపల్లెలో తన సమీప బంధువులు గంగమ్మ జాతరకు బోనాలు పెడుతుండడంతో వారి ఆహ్వానం మేరకు టీవీఎస్ స్కూటర్‌లో రామాపురానికి వచ్చి తిరిగి నల్లగుట్టపల్లె కొత్తపల్లెకు వెళుతుండగా రాయచోటి వైపు నుంచి కడప వైపు వెళ్తున్న కారు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతడిని పోలీసులు 108 వాహనంలో లక్కిరెడ్డిపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందాడు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం లక్కిరెడ్డిపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎల్వీ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. మృతునికి భార్య, పిల్లలు ఉన్నారు.

టీడీపీ సీనియర్ నాయకుడు మృతి

జమ్మలమడుగు, మార్చి 10: జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలో దిగువపట్నం కాలనీలో నివాసం ఉంటున్న టీడీపీ సీనియర్ నాయకుడు, టీడీపీ ఎస్సీసెల్ నియోజకవర్గ అధ్యక్షుడు బీర్రు నెల్సన్‌కుమార్ (55) మృతిచెందాడు. ఆయన మృతిచెందిన సమాచారం తెలుసుకున్న వెంటనే మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి మృతదేహాన్ని సందర్శించారు. మృతుడు కిడ్నీ సమస్యతో ఇంటి వద్దనే విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఉన్నట్లుండి ఆదివారం ఉదయం టీవీలో జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి దేవగుడి భూపేశ్‌రెడ్డికి టీడీపీ టిక్కెట్ రాదని, చూసి బాధపడుతూ ఒక్కసారిగా ఇంట్లో కుప్పకూలి పడిపోయినట్లు మృతురాలి భార్య ఓబుళమ్మ తెలిపారు.

విద్యుత్ వైరు చోరీ కేసులో వ్యక్తి అరెస్టు

కొండాపురం,మార్చి 10: మండలంలోని ముంపునకు గురైన పాత తాళ్లప్రొద్దుటూరు ప్రాంతంలో విద్యుత్ వైరు చోరీ కేసులో పోలీసులు రఘు అనే మరో వ్యక్తిని ఆదివారం అరెస్టు చేశారు. ఇప్పటికే ఈ కేసులో ఇద్దరిని అరెస్టు చేశారు.అనిల్,మనోహర్‌తో పాటు రఘు అనే వ్యక్తి కలిసి విద్యుత్‌స్తంభాల వైరు చోరీకి పాల్పడినట్లు ఎలక్ట్రికల్ ఏఈ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు తాళ్లప్రొద్దుటూరు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు.

భర్త కనిపించలేదంటూ భార్య ఫిర్యాదు


వెంకటబాలమురళి

రామాపురం, మార్చి 10: మండలంలోని హసనాపురం పంచాయతీ పప్పిరెడ్డిగారిపల్లెకు చెందిన గరికపాటి వెంకటబాలమురళి (30) ఈనెల 6న నుంచి కనిపించడం లేదని తన భార్య సలేంద్ర చిన్నరెడ్డెమ్మ ఆదివారం రాత్రి రామాపురం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ వీఎల్ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. వివరాల్లోకి వెళితే... రామాపురం మండలం హసనాపురం పంచాయతీ పప్పిరెడ్డిగారిపల్లె చెందిన గరికపాటి వెంకటబాలమురళితో రాయచోటి పట్టణం మదనపల్లె రోడ్డులోని శివాలయం సమీపంలో నివాసం ఉంటున్న ఆకుల శంకరయ్య కుమార్తె చిన్నరెడ్డెమ్మతో మూడు సంవత్సరాల క్రితం వివాహమైందని, వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారని ఆమె ఫిర్యాదులో తెలిపారు. తన భర్త గ్రామంలోని ఆలయంలో పూజారిగా ఉంటూ తన స్వగ్రామం పప్పిరెడ్డిగారి పల్లెకు వెళ్తానని చెప్పి వెళ్లాడని, అప్పటి నుంచి ఇంతవరకు రాకపోవడంతో చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో వెతికామని, ఎక్కడా కనిపించకపోవడంతో రామాపురం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మూల్యాంకనంలో కోడింగ్ అత్యంత కీలకం

అవగాహన కార్యక్రమంలో ఆర్జేడీ రాఘవరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్జేడీ రాఘవరెడ్డి

రాయచోటిటౌన్, మార్చి 10: పదవ తరగతి పరీక్షల మూల్యాంకనంలో కోడింగ్ అత్యంత కీలకమని ఆర్జేడీ రాఘవరెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలోని మదనపల్లె రోడ్డులో గల అజయ్ కన్వెన్షన్ హాల్‌లో జరిగిన పదవ తరగతిలో కోడింగ్ విధానంపై జరిగిన అవగాహన కార్యక్రమానికి రాయలసీమ ప్రాంతంలోని 8 జిల్లాల విద్యాశాఖాధికారులు, అసిస్టెంట్ కమిషనర్లు, చీఫ్ కోడింగ్ అధికారులు, అసిస్టెంట్ కోడింగ్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కడప ప్రాంతీయ సంచాలకులు రాఘవరెడ్డి మాట్లాడుతూ పదవ తరగతి మూల్యాంకనంలో కోడింగ్ విధానంలో ఎటువంటి పొరపాట్లకు అవకాశం లేకుండా ఒక్క విద్యార్థి కూడా నష్టపోకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ట్రైనింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలని, అనుమానాలుంటే ఇక్కడే తీర్చుకోవాలని తెలియజేశారు. అనంతరం రీసోర్స్‌పర్సన్ సుంకర రామకృష్ణ కోడింగ్ ప్రక్రియలో మొదటిరోజు నుంచి చివరి రోజు వరకు ఎలా చేయాలి, ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో పూర్తిగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. మధ్య మధ్యలో వారికి కలిగిన అనుమానాలను కూడా తీర్చారు. ఈ కార్యక్రమంలో డీఈఓ మీనాక్షి, అనంతపురం జిల్లా విద్యాశాఖాధికారి వరలక్ష్మి, కడప జిల్లా విద్యాశాఖాధికారి అనురాధ, ఏడీ ప్రసాద్‌బాబు, డీసీఈబీ సెక్రటరీ నాగమునిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా బాడీబిల్డింగ్ పోటీలు



కడప (స్పోర్ట్స్), మార్చి 10: మిస్టర్ ఆంధ్రా బాడీ బిల్డర్ స్వర్గీయ షంషీరుద్దీన్ జ్ఞాపకార్థం కడప జిల్లా న్యూ ఆంధ్రా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ సారథ్యంలో ఆదివారం రాత్రి స్థానిక నేక్‌నామ్ కళాక్షేత్రంలో టైగర్ రాయలసీమ స్థాయి జోనల్ బాడీ బిల్డింగ్ పోటీలు నిర్వహించారు. పోటీలకు రాయలసీమ జిల్లాల నుంచి సుమారు 150 మంది బాడీ బిల్డర్లు హాజరయ్యారు. వీరిలో వివిధ క్యాటగిరీల వారిగా నిర్వాహకులు పోటీలు చేపట్టారు. కార్యక్రమంలో స్టేట్ బాడీ బిల్డింగ్ జనరల్ సెక్రటరీ షేక్ న్యాయతుల్లా, పి.ఇంతియాజ్, జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ సెక్రటరీ తారీక్‌అలీ, వైస్ ప్రెసిడెంట్ అన్సర్ అలీ, సెక్రటరీ షేక్ ముక్తియార్, షేక్ రషీద్, మహబూబ్‌బాష తదితరులు పాల్గొన్నారు.

ఐదేళ్లలో కార్యకర్తలకు న్యాయం చేయలేకపోయాం...

- టీడీపీ అధికారంలోకి వస్తే ప్యాంటు, చొక్కా ఊడదీస్తారు
- కార్యకర్తల సమావేశంలో ఎంపీ మిథున్‌రెడ్డి
- సమావేశానికి డుమ్మా కొట్టిన పలువురు నాయకులు


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ మిథున్‌రెడ్డి

సుండుపల్లె, మార్చి10: ఐదేళ్ల కాలంలో కార్యకర్తలకు సరైన న్యాయం చేయలేకపోయామని, టీడీపీ అధికారంలోకి వస్తే వైసీపీ నాయకులు, కార్యకర్తల ప్యాంట్లు, చొక్కాలు ఊడదీస్తారని, ఈ విషయాన్ని గుర్తుంచుకుని వర్గాలు లేకుండా అందరూ కలసికట్టుగా పనిచేయాలని ఎంపీ మిథున్‌రెడ్డి నాయకులు, కార్యకర్తలకు తెలిపారు. సుండుపల్లెలో ఆదివారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఎంపీతో పాటు రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి, ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఐదేళ్ల కాలంలో కార్యకర్తలందరికీ న్యాయం చేయలేకపోయామని తెలిపారు. ఇప్పటివరకు పట్టించుకోని వారు ఇప్పుడు కలిసి పనిచేద్దామని మాట్లాడడం విడ్డూరంగా ఉందని పలువురు కార్యకర్తలు సమావేశం జరుగుతుండగానే గుసగుసలాడుకున్నారు. సమావేశానికి వైసీపీ జిల్లా సమన్వయకర్త ఆరంరెడ్డి, తిరుమలరెడ్డి శివారెడ్డి, మాజీ ఎంపీటీసీ మహేశ్వర్‌రెడ్డి, భాగంపల్లి అజయ్‌కుమార్‌రెడ్డి, సుమారు 6 మంది సర్పంచులు, 5 మంది ఎంపీటీసీలతో పాటు కార్యకర్తలు, నాయకులు సమావేశానికి డుమ్మా కొట్టారు. అయితే కొంత మంది సర్పంచులు, సింగిల్‌విండో అధ్యక్షులు, ఎంపీటీసీలకు సభా వేదిక మీదస్థానం కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యకర్తల సమావేశంలో కనీసం ఒక్క కార్యకర్తకు కూడా ప్రసంగించే అవకాశం ఇవ్వలేదని బహిర్గతంగా మాట్లాడుకుంటూ నిరుత్సాహంతో కార్యకర్తలు వెనుదిరిగారు. పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఐదు సంవత్సరాలు మమ్మల్ని పట్టించుకోలేదు. సమావేశంలో కూడా మా బాధలు చెప్పుకునేలా మాట్లాడే అవకాశం ఇవ్వలేదని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.

కడపలో నేటి స్పందన తాత్కాలికంగా రద్దు

కడప (కలెక్టరేట్), మార్చి 10: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ ఈనెల 11న కడప జిల్లాలో పర్యటిస్తున్న నేపథ్యంలో కడప కలెక్టరేట్‌లో జరిగే ప్రజా ఫిర్యాదుల స్వీకరణ, స్పందన కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ విజయరామరాజు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

శివమాల భక్తులు శ్రీశైలం పయనం

కలకడ, మార్చి 10: కలకడ మండలానికి చెందిన శివమాల భక్తులు శ్రీశైలంలో కొలువైన మల్లికార్జునస్వామిని దర్శించుకొనేందుకు ఆదివారం ఉదయం బయలుదేరారు. గురుస్వామి వై.శ్రీనివాసులు ఆధ్వర్యంలో 41 రోజుల దీక్షలో ఉన్నవారు. ఝరిలో స్నానాలు చేసి శైకత లింగానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఇరుముడులు ధరించి 40 మంది భక్తులు బయలుదేరారు.

నంది వాహనంపై వీరబ్రహ్మేంద్రస్వామి


నంది వాహనంపై ఊరేగిన వీరబ్రహ్మేంద్రస్వామి గోవిందమాంబ

బ్రహ్మంగారిమఠం, మార్చి 10 : శివరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఆదివారం తెల్లవారుజామున పోతులూరివీరబ్రహ్మేంద్రస్వామి సమేత గోవిందమాంబ కన్నులపండువగా, వైభవంగా నందివాహనంపై స్వామి నివాసగృహం పురవీధుల్లో వైభవంగా గ్రామోత్సవాన్ని దేవస్థానం వారు నిర్వహించారు. స్వామివారికి గ్రామంలోని ప్రజలందరూ కాయకర్పూరం సమర్పించారు. అనంతరం దేవస్థానం ఆవరణంలో గజవాహనంపై స్వామివారిని ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. కాగా ఆదివారం మహా ప్రసాదం రోజు కావడంతో భక్తులకు దేవస్థానం సిబ్బంది ప్రసాదాన్ని అందించారు.

సింహవాహనంపై జగన్మాత ఈశ్వరీదేవి అమ్మవారు..: ఈశ్వరీదేవి అమ్మవారు మహాశివరాత్రి పురస్కరించుకుని ఆదివారం గ్రామోత్సవం చేశారు. అనంతరం ఈశ్వరీదేవి దేవస్థానం వారు భక్తులకు మహా ప్రసాదాన్ని పంపిణీ చేశారు.

ప్రకృతి సౌందర్యానికి ప్రతిరూపం 'లంకమలదారుల్లో' పుస్తకం


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రొఫెసరు రాంప్రసాద్‌రెడ్డి

కడప (ఎడ్యుకేషన్), మార్చి 10 : లంకమల వివేక్ రచించిన లంకమల దారుల్లో పుస్తకం ప్రకృతి సౌందర్యానికి ప్రతిరూపమని సీపీ బ్రౌన్ ఉపసంచాలకుడు ప్రొఫెసరు రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆదివారం సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో లంకమల దారుల్లో.. పుస్తక పరిచయ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివేక్ రచించిన లంకమల దారుల్లో పుస్తకం కేవలం యాత్రా సందర్శన పుస్తకమే కాక విజ్ఞాన దాయక కథాంశాలతో కూడుకున్న విశ్లేషాత్మక రచన అని తెలిపారు. ఇన్ టు ద నేచర్ సభ్యులంతా కలిసి లంకమల అభయారణ్యాన్ని రేయింబవళ్లు తిరిగి వారి అనుభవాలను పుస్తకంగా రూపొందించి లంకమలను అందరికీ చేరువ చేశారన్నారు. అనంతరం రాజకీయ విశ్లేషకులు శివరాచర్ల, బద్వేలు ఆర్డీవో ఆకుల వెంకటరమణ, సాయంకాలం దినపత్రిక డిటర్ వెంకటరెడ్డి , పాలగిరి విశ్వప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయురాలు రాజేశ్వరి, శివానందరెడ్డి, సరస్వతి, గోవర్ధనరెడ్డి, సుధీర్‌రెడ్డిలు మాట్లాడారు. కార్యక్రమంలో వివేక్ కుటుంబ సభ్యులు, వైవీయు అధ్యాపకులు ప్రొఫెసరు రమాదేవి, ప్రొఫెసరు కాత్యాయని, సీపీ బ్రౌన్ కేంద్రం పరిశోధకుడు భూతపురి గోపాలకృష్ణ, చింతకుంట శివారెడ్డి, జి.హరిభూషణ్ రావు, ఆర్.వెంకటరమణ, శ్యాంప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

ముస్తాబైన వెంకటేశ్వరస్వామి ఆలయం

● 18, 19, 20వ తేదీల్లో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం



ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న ఆలయం

గాలివీడు, మార్చి 10: మండల కేంద్రంలోని పెద్దూరు బ్రాహ్మణవీధిలో వెలసిన అతి పురాతన వెంకటేశ్వరస్వామి ఆలయం ప్రారంభోత్సవానికి ముస్తాబైంది. ఈ నెల 18, 19, 20వ తేదీల్లో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. దీంతో ఈ ఆలయం పూర్వ వైభవం సంతరించుకుంటుందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సాక్షాత్తు శ్రీఅన్నమాచార్యుల వారు స్వయంగా గాలివీడు వెంకటేశ్వరున్ని దర్శించి తిమ్మినాయడా అంటూ కీర్తించిన కీర్తనలతో పులకించిన 13వ శతాబ్దపు నాటి శ్రీవారి ఆలయం శిథిలావస్థ నుంచి నేడు పునఃనిర్మాణ పనులు పూర్తి చేసుకుని విగ్రహ ప్రతిష్ఠ మహత్సవానికి సిద్ధమైంది. శ్రీలక్ష్మీదేవి, గోదాదేవి సమేత వెంకటశ్వరస్వామి విగ్రహాల ప్రాణప్రతిష్ఠ అనంతరం కల్యాణోత్సవం కార్యక్రమాలను ఆగమనశాస్త్రం ప్రకారం నాగఫణికిశోర్‌శర్మ ఆధ్వర్యంలో టీటీడీ పౌరోహితులచే శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. చివరి రోజు 20న మధ్యాహ్నం 2 గంటల నుంచి కోలాటాలు, చెక్కభజనలు, బృందావనం, కాంతార, వివిధ దేవతామూర్తుల వేషధారణల్లో నృత్యాలతో బస్టాండు నుంచి గేటు నాలుగు రోడ్ల కూడలి వరకు స్వామి వారి శోభాయాత్ర నిర్వహించుటకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ఈవో కొండారెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులు స్పష్టం చేశారు. ఈ మహోత్సవానికి విచ్చేయు భక్తులకు మూడు రోజుల పాటు పెద్ద ఎత్తున అన్నప్రసాదాల వితరణకు సన్నాహాలు చేశామన్నారు.

కవులకు పుట్టినిల్లు : గానుగపెంట

రాజంపేటటౌన్, మార్చి 10: కవులకు, కళాకారులకు, కవయిత్రులకు అన్నమయ్య జిల్లా ఉమ్మడి కడప జిల్లా పుట్టినిల్లని మొల్ల సాహితీపీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు, విద్వాన్ గానుగపెంట హనుమంతరావు పేర్కొన్నారు. రాజంపేటలో జరిగిన మొల్ల సాహితీ జయంతి ఉత్సవాలకు ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ తాళ్లపాక తిమ్మక్క, కవయిత్రి మొల్లమాంబ కడప జిల్లా వారు కావడం గర్వకారణమన్నారు. స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ పసుపులేటి శంకర్ మాట్లాడుతూ మహాకవయిత్రి పేరుతో పురస్కారం అందుకోవడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు కాకర్ల రాముడు, తెలుగుభాష సంరక్షణ సమితి జిల్లా సహాయ కార్యదర్శి వెంకటరమణ, మొల్ల సాహితీపీఠం ప్రధాన కార్యదర్శి మనోజ్‌కుమార్ మాట్లాడారు. కాగా మొల్ల సాహిత్య సేవా పురస్కారాన్ని, నగదును రాజంపేట స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ పసుపులేటి శంకర్‌కు అందజేశారు. కార్యక్రమంలో నందకిషోర్, డాక్టర్ ప్రసాద్, వెంకటరమణ, నారాయణరాజు, అబ్దుల్లా, రామ్మోహన్, నాగార్జున, యు.పి.రాయుడు, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

వేడుకగా ప్రారంభమైన గంగమ్మజాతర

● వేల సంఖ్యలో జాతరకు చేరుకున్న భక్తులు




ప్రత్యేక అలంకరణలో అమ్మవారు, దర్శనానికి క్యూలో వస్తున్న చెల్లు వంశీయులు

లక్కిరెడ్డిపల్లె, మార్చి 10: రాయలసీమకే తలమానికంగా నిలసిన అనంతపురం గంగమ్మజాతర ఆదివారం ప్రారంభమైంది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ముడుపులు, బోనాలు సమర్పించారు. చెల్లు వంశీయులైన గొల్లపల్లెలో వెలసిన అమ్మవారు శనివారం రాత్రి సాంప్రదాయంగా అమ్మవారికి పట్టువస్త్రాలతో అత్యంత వైభవంగా గొల్లపల్లె నుంచి తెల్లవారుజామున గంగమ్మజాతరకు చేరకుంది. ఆదివారం ఉదయం నుంచి పూజలు నిర్వహించారు. రాత్రికి వేల సంఖ్యలో భక్తులు జాతరకు చేరుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేక అలంకరణ చేశారు. జాతరలో ప్రత్యేక క్యూలైన్లు, మంచినీటి సరఫరా, విద్యుత్ సప్లై, మహిళలకు ప్రత్యేక స్నానవాటికలు, కల్యాణ గట్టు, మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. భక్తులు తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు పడకుండా దాతలు మజ్జిగ, వాటర్ ప్యాకెట్లు ఏర్పాటు చేశారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రాయచోటి డీఎస్పీ మహబూబ్‌బాషా, సీఐ జీవన్ గంగనాధబాబు ఆధ్వర్యంలో 500 మంది పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఈ ఏడాది అమ్మవారిని బెంగుళూరు అర్చకులచే ప్రత్యేక అలంకరణ చేశారు. ఆదివారం రాత్రిచాగలగుట్టపల్లెలో అమ్మవారి ఆలయం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు, చెక్కభజనలు, దీపాలంకరణతో వెలుగొందింది. అమ్మవారు సోమవారం తెల్లవారుజామున అత్యంత వైభవంగా డప్పు వాయిద్యాల మధ్య జాతరకు చేరుకుంటారు. దీంతో సోమవారం ఉదయం నుంచి అమ్మవారి దర్శనాలు, పూజలు జరుగుతాయని ఆలయ ఈఓ రవీంద్ర రాజు, చైర్మన్ మురికినాటి రెడ్డయ్య తెలిపారు. కమిటీ సభ్యులు, జాతరకు ప్రత్యేక వలంటీర్లను నియమించారు.

ఒక్క అవకాశం ఇవ్వండి.. గుండెల్లో పెట్టుకుంటా

● మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

చిన్నమండెం, మార్చి 10: ఒక్క అవకాశం ఇవ్వండి గుండెల్లో పెట్టుకుంటా అని రాయచోటి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని చావిడికుంటలో టీడీపీ ఆధ్వర్యంలో జరిగిన ముస్లింల ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. అనంతరం మాట్లాడుతూ తన కుటుంబ సభ్యుల వలే అందరినీ గుండెల్లో పెట్టుకుని చూసుకుంటానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే ఈ ఐదు సంవత్సరాల కాలంలో తన సొంత ఆస్తులు పెంచుకోవడం తప్ప అభివృద్ధి జరిగింది లేదని విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో రాయచోటి అసెంబ్లీ స్థానాన్ని, రాజంపేట పార్లమెంట్ స్థానాన్ని అత్యధిక మెజారిటీతో గెలిపించడానికి ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే యువతకు ఉద్యోగ అవకాశాలు వస్తాయని పేర్కొన్నారు. అలాగే మండలంలో ముస్లిం యువతకు జూనియర్ కళాశాల ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా, జాఫర్‌వలి, అక్రమ్, దస్తగిరి, రహంతుల్లా, అస్రఫ్, సలీం, శ్రీనాథ్, షకీర్, అన్వర్, హర్షద్, ఇర్షాద్ తదితరులు పాల్గొన్నారు.



ముస్లింల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న మండిపల్లి

టీడీపీలో చేరిన ముస్లింలు

రాయచోటిటౌన్, మార్చి 10: ఎన్నికల ప్రచారంలో భాగంగా రాయచోటి మున్సిపాలిటీ పరిధిలోని 10, 11వ వార్డుకు విచ్చేసిన రాయచోటి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి మైనార్టీలు పూలదండలు, బాణాసంచాలతో ఘనస్వాగతం పలికారు. అనంతరం వార్డుకు చెందిన నాయకులతో కలిసి వార్డులోనే దాదాపు 150 మైనార్టీ కుటుంబాలను కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన ఇంటింటికి తిరుగుతూ సైకిల్ గుర్తుకు ఓటు వేసి రాయచోటి అసెంబ్లీ స్థానాన్ని, రాజంపేట పార్లమెంట్ స్థానాన్ని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ముందుకు సాగారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఖాదర్‌బాషా, జాఫర్ అలీ, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ అన్వర్‌బాషా, రాజంపేట పార్లమెంటరీ మహిళా ఆర్గనైజేషన్ సెక్రటరీ మస్తాన్‌బీ, ఖాసీం సాబ్ పాల్గొన్నారు.

రాయచోటిలో ఆత్మీయ సమావేశం

ఆదివారం సాయంత్రం రాయచోటి మున్సిపాలిటీ పరిధిలోని సలీం రైస్‌మిల్లులో తెలుగు యువత పట్టణ అధ్యక్షుడు ఇమామ్‌బాషా, దస్తగిరిల ఆధ్వర్యంలో జరిగిన ఆత్మీయ సమావేశంలో 31 కుటుంబాలు టీడీపీలోకి చేరారు. ఈ సందర్భంగా మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి వారికి కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ రాయచోటి అసెంబ్లీ స్థానాన్ని, రాజంపేట పార్లమెంట్ స్థానాన్ని అత్యధిక మెజార్టీతో గెలిపించడానికి ప్రతిఒక్కరూ కష్టపడాలన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఖాదర్‌బాషా, జాఫర్‌వలి, జిల్లు ఫకీర్, అతావుల్లా, అక్రమ్, నజీర్, షంషీర్, సుబ్బారెడ్డి, హర్షద్, ఇర్షాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్కంఠభరితంగా బండలాగుడు పోటీలు



బండలాగుడు పోటీల్లో పాల్గొన్న వృషభాలు

ఒంటిమిట్ట, మార్చి 10: ఉత్కంఠ భరితంగా ఎద్దుల బండలాగుడు పోటీలను మండలంలోని సాలాబాదు గ్రామంలో నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ఉదయం అమ్మవారికి మహిళలు పెద్దఎత్తున బోనాలు సమర్పించారు. సాయంత్రం సాలాబాదు గ్రామంలో వెలసిన వీరగంగమ్మ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఈ పోటీలను నిర్వహించారు. పోటీ ప్రారంభం నుంచి పోటీలు ఉత్కంఠభరితంగా కొనసాగాయి. పోతిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన మొదటి జత ఎద్దులు 903 అడుగులు లాగి మొదటి స్థానంలో నిలవగా, బద్వేలుకు చెందిన పెద్ద వీరయ్యస్వామి ఎద్దులు 819 అడుగులు లాగి రెండవ స్థానం, గోసులవారిపల్లె గ్రామానికి చెందిన ఎద్దులు 818 అడుగులు లాగి మూడవస్థానంలో నిలిచాయి. మిగిలిన రెండు జతల ఎడ్లకు కన్సొలేషన్ బహుమతులను నిర్వాహకులు అందజేశారు.

యథేచ్ఛగా మట్టి రవాణా

సిద్దవటం, మార్చి 10: మండల పరిధిలోని శాఖరాజుపల్లె గ్రామ పంచాయతీలోని కొండ ప్రాంతాల్లో ఎటువంటి ప్రభుత్వ అనుమతి లేకుండా యథేచ్ఛగా మట్టి రవాణా చేస్తున్నారు. గ్రావెల్‌ను రాత్రి వేళల్లో జేసీబీ యంత్రాలతో కొండలు సైతం పగలగొట్టి ఎర్రమట్టిని అక్రమ రవాణా చేస్తూ రూ.లక్షలు సంపాదిస్తున్నారని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. సామాన్య ప్రజలకు ఇంటి అవసరాలు నిమిత్తమై పునాదులకు ఏ మాత్రం మట్టి కూడా దొరకడం లేదని, అక్రమణదారులకు యథేచ్ఛగా రాత్రివేళల్లో కొండ సంపద తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని చెబుతున్నారు. వీటితో పాటు ఇసుకను అనుమతి లేకుండా డేగనివారిపల్లె, లింగంపల్లె, పెన్నానది నుంచి అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని సంబంధించిన అధికారులు అక్రమణదారులపై నిఘా పెట్టి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై వీఆర్వో ప్రభాకర్‌రెడ్డిని వివరణ కోరగా గత పది రోజులుగా ఎలాంటి అక్రమ మట్టి తవ్వకాలు జరగలేదని, మళ్లీ పరిశీలిస్తామని తెలిపారు.



గ్రావెల్ తరలించిన ప్రాంతం ఇదే..

ప్రాజెక్టును పునరుద్ధరించాలని ధర్నా

రాజంపేట, మార్చి 10: ప్రాజెక్టు తెగిపోయి రెండున్నరేళ్లు కావస్తున్నా ఇంత వరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్టును పునఃరుద్ధరించలేదని, వెనువెంటనే పునరుద్ధరించాలని ఆదివారం సీపీఐ నేతలు ధర్నా నిర్వహించారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అన్నమయ్య ప్రాజెక్టు పాలకుల వల్లే తెగిపోయిందని, ఇసుక దాహానికి ప్రాజెక్టు బలైందన్నారు. 24 నెలల్లో ప్రాజెక్టును ప్రారంభిస్తామన్న ముఖ్యమంత్రి హామీ నేడు తట్టెడు సిమెంటుకు నోచుకోలేదన్నారు. ప్రాజెక్టు లేక తాగునీరు, సాగునీరు కరువైందన్నారు. ప్రాజెక్టు తెగిపోవడం వల్ల సర్వస్వం కోల్పోయిన వారికి ఇంత వరకు ఒక్క ఇంటిని కూడా నిర్మించలేదన్నారు. సీఎం మాటలు నీటి మూటలయ్యాయని, అందువల్ల వెంటనే ప్రాజెక్టును పునరుద్ధరించాలని కోరుతూ ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టును పునఃనిర్మిస్తే రాజంపేట, పుల్లంపేట, పెనగలూరు, నందలూరు మండలాల ప్రజలకు తాగునీరు, సాగునీరు లభిస్తుందన్నారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు ముంపు బాధితులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ కార్యదర్శి నరసింహ, సహాయ కార్యదర్శి పి.మహేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు శివరామకృష్ణదేవర, రాజంపేట నియోజకవర్గ సహాయ కార్యదర్శి ఎం.ఎస్.రాయుడు, పట్టణ కార్యదర్శి సికిందర్, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు సరోజనమ్మ, రైతు సంఘ ప్రధాన కార్యదర్శి రంగారెడ్డి, భవన నిర్మాణ కార్మిక జిల్లా అధ్యక్షులు గాలి చంద్ర తదితరులు పాల్గొన్నారు.



అన్నమయ్య ప్రాజెక్టు వద్ద ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

అమ్మవారికి వెండి పళ్లెం వితరణ

గుర్రంకొండ, మార్చి 10: సంతానలక్ష్మీగా ప్రసిద్ధి చెందిన రెడ్డెమ్మ అమ్మవారికి దాతలు వెండి పళ్లెంను వితరణగా అందజేశారు. రాయచోటికి చెందిన నితిన్ రాంగోపాల్ అమ్మవారికి మొక్కుగా 494 గ్రాముల బరువు ఉన్న వెండి పళ్లెంను బహూకరించారు. దీని విలువ రూ.40 వేలు ఉంటుందని ఈవో మంజుల తెలిపారు.

రెడ్డెమ్మకు ప్రత్యేక పూజలు: మండలంలోని రెడ్డెమ్మకొండ ఆలయంలో ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆలయంలో అమ్మవారు సంతానలక్ష్మీగా ప్రసిద్ధి చెందారు. అమ్మవారి కృపతో సంతానం పొందిన మహిళలు మొక్కులు తీర్చుకోవడానికి అధిక సంఖ్యలో వచ్చారు. ఆలయ పరిసరాలు భక్తులతో రద్దీగా మారాయి. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

13 మందికి కంటి ఆపరేషన్లు

రాయచోటిటౌన్, మార్చి 10: రాయచోటి మండల పరిధిలోని చెన్నముక్కపల్లె గ్రామంలో గల లయన్స్ కంటి ఆసుపత్రిలో ఆదివారం జరిగిన కంటి వైద్య శిబిరంలో 13 మందికి కంటి ఆపరేషన్లు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పరిధిలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన 40 మంది కంటికి పరీక్షలు నిర్వహించగా, అందులో 13 మందికి ఆపరేషన్లు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కంటి ఆసుపత్రి చైర్మన్ వైవీఆర్ స్వరూపగుప్త, మార్కెట్ కమిటీ మాజీ లయన్ చెన్నూరు అన్వర్‌బాషా, ఏపీఐఐసీ డైరెక్టర్ శ్రీనివాసులరెడ్డి, కంటి వైద్యులు సురేశ్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

బలిజ సేన జిల్లా అధ్యక్షుడిగా కె.ఎస్.నరసింహ



రాజంపేట, మార్చి 10: బలిజ సేన జిల్లా అధ్యక్షుడిగా రాజంపేట మండలం భువనగిరిపల్లెకు చెందిన కె.ఎస్.నరసింహ (టైల్స్ నరసింహ) నియమితులయ్యారు. ఈ మేరకు బలిజసేన రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు ఆర్కాట్ కృష్ణప్రసాద్, ఉపాధ్యక్షుడు మస్తాన్‌రాయల్ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో నరసింహ బలిజ సేన జిల్లా యువజన నాయకుడిగా కూడా పనిచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన నియామకంలో కీలక పాత్ర పోషించిన అధ్యక్ష, ఉపాధ్యక్షులకు కృతజ్ఞతలు తెలియజేశారు. జిల్లాలోని బలిజ సంక్షేమ సంఘం అభివృద్ధికి, రాజకీయ అభివృద్ధికి తన శక్తివంచన లేకుండా కృషి చేస్తానని వెల్లడించారు. త్వరలో జిల్లా వ్యాప్తంగా సమావేశాలు నిర్వహించి బలిజ సేనను పటిష్ఠ పరుస్తానని వెల్లడించారు.

ఆలయానికి మైక్ సెట్ వితరణ



మైక్ సెట్ అందజేస్తున్న సర్పంచ్

నందలూరు, మార్చి 10: మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ నారాయణరాజుపేట గ్రామ సమీపంలో కొలువైన భ్రమరాంభిక సమేత మల్లికార్జున స్వామి దేవస్థానానికి మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు జంబు సూర్యనారాయణ మైక్ సెట్ వితరణగా అందజేశారు. ఆదివారం ఉదయం ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందుకున్నారు. అనంతరం ఆలయ ధర్మకర్త, అర్చకుడు కమ్మర సర్వేశ్వర ఆచారి సర్పంచ్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు నాయనపల్లి ఆదినారాయణ, గ్రామ నాయకులు ఎముక దుర్గయ్య, అక్కి వెంకటరమణ, తుమ్మాది శివకుమార్, పొమ్మల శివ నరసింహులు, నాయనపల్లి వెంకటసుబ్బయ్య, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ అసోసియేషన్ జిల్లా కోశాధికారిగా సుబ్రహ్మణ్యం



మండల సుబ్రహ్మణ్యంను సన్మానిస్తున్న దృశ్యం

రైల్వేకోడూరు, మార్చి 10: మెడికల్ అసోసియేషన్ జిల్లా కోశాధికారిగా సుబ్రహ్మణ్యం ఎంపికయ్యారు. ఈ మేరకు రాయచోటిలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైల్వేకోడూరు, రాజంపేట మెడికల్ షాపుల యజమానులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి రైల్వేకోడూరు మెడికల్ షాపుల అసోసియేషన్ అధ్యక్షుడు నార్జాల రాము, సభ్యులు మోతీలాల్, కదిరి శ్రీనివాసులు, ఎలిశెట్టి బాబు తదితరులు పాల్గొన్నారు.

రూ.20 వేలు ఆర్థిక సాయం

రైల్వేకోడూరు, మార్చి 10: మండలంలోని ఉర్లగట్టుపోడు గ్రామానికి చెందిన వెంబడి ప్రతాప్ కుమార్తె యశ్విత డెంగ్యూ జ్వరంతో బాధపడుతూ తిరుపతిలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఈ విషయం తెలుసుకున్న రైల్వేకోడూరు టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డి తనయుడు టీడీపీ యువనేత ముక్కా సాయివికాస్‌రెడ్డి తిరుపతికి వెళ్లి బాధితురాలి తల్లిదండ్రులకు రూ.20 వేలు చెక్కును ఆదివారం అందించారు. ఈ కార్యక్రమంలో తేనేపల్లి రామయ్య, వెంబడి గుండయ్య, నారపరెడ్డి రాజారెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, ముక్కావారిపల్లె సర్పంచ్ శ్రీధర్, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కస్తూరి నాయకత్వంలోనే పనిచేస్తాం

● నియోజకవర్గ టీడీపీ నేతలు

రైల్వేకోడూరు, మార్చి 10: టీడీపీ సీనియర్ నేత కస్తూరి విశ్వనాథనాయుడు నాయకత్వంలో తామంతా పనిచేస్తామని, మరొకరి వద్ద తాము చేయలేమని నియోజకవర్గ టీడీపీ నేతలు అన్నారు. ఆదివారం సాయంత్రం రైల్వేకోడూరు పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర బీసీ నాయకులు నాయిడోరి రమణయాదవ్, ప్రముఖ న్యాయవాదులు కేజేపీ రెడ్డయ్య నాయుడు, నాయిని బాలాజీ, జిల్లా రైతు విభాగం సీనియర్ నాయకులు పెరుగు క్రిష్ణయ్యనాయుడులు మాట్లాడుతూ ఒకటి, రెండు రోజుల్లో అధిష్ఠానం మంచి నిర్ణయం తీసుకుంటుందని ఆశిస్తున్నామని, లేనిపక్షంలో అందరం పార్టీకి రాజీనామాలు చేస్తామని తెలిపారు. కొన్నేళ్లుగా పార్టీని కాపాడుకుంటూ వచ్చి తీరా విజయం సాధించే సమయంలో పార్టీ తప్పుడు నిర్ణయం తీసుకోవడం తగదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆది నుంచి కార్యకర్తలు, నాయకులు పార్టీ కోసం అహర్నిశలు కష్టపడి పార్టీని బలోపేతం చేశారని గుర్తు చేశారు. రైల్వేకోడూరులో కనుమరుగైన పార్టీని విశ్వనాథనాయుడు కాపాడుకుంటూ వచ్చారని, అధిష్ఠానం కస్తూరిని పిలిపించి చర్చించి తగిన నిర్ణయం తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేత కస్తూరి విశ్వనాథనాయుడు, నాయకులు కేకే చౌదరి, వెంకటేశ్వర్‌రాజు, దుద్యాల జయచంద్ర, నగిరిపాటి రేవతి తదితరులు పాల్గొన్నారు.



పార్టీ కార్యాలయంలో మాట్లాడుతున్న నాయకులు

పొలిమేరపల్లెలో ఇంటింటి ప్రచారం



ఇంటింటి ప్రచారంలో రాంప్రసాద్‌రెడ్డి సతీమణి హరితారెడ్డి

చిన్నమండెం, మార్చి 10: మండలంలోని పొలిమేరపల్లె గ్రామంలో ఉండే కాయలవాండ్లపల్లెలో ఇంటింటికి ఎన్నికల ప్రచారంలో రాయచోటి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సతీమణి హరితారెడ్డి, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీకి ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను విజ్ఞప్తి చేశారు. ఈ వైసీపీ ప్రభుత్వంలో మచ్చుకైనా అభివృద్ధి జరగలేదని, గుంతలు పడిన రోడ్లకు కనీసం మట్టి కూడా వేయలేదని విమర్శించారు. సంక్షేమ పథకాల పేరుతో ఒక చేత్తో డబ్బు ఇచ్చి మరో చేత్తో పన్నుల రూపంలో లాక్కోవడం తప్ప ఈ ప్రభుత్వానికి మరొకటి చేతకావడం లేదని ఆమె విమర్శించారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా, పిల్లల భవిష్యత్తు బాగుండాలన్న చంద్రబాబు సీఎం అయితేనే అని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. జాబు రావాలంటే బాబు కావాలంటూ నినాదాలు చేస్తూ ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

ప్రశాంత ఎన్నికల నిర్వహణకు కేంద్ర బలగాల కవాతు



చిత్తూరు, మార్చి 10: ప్రశాంత వాతావరణంలో ఎన్నికలను నిర్వహించడంతో పాటు ప్రజల్లో నమ్మకం, ఆత్మవిశ్వాసం నింపడానికి ఆదివారం కేంద్ర బలగాలు చిత్తూరుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా కేంద్ర బలగాలతో పాటు సుమారు వంద మంది సివిల్, ఆర్మ్‌డ్ సిబ్బంది పలు వీధుల్లో కవాతు నిర్వహించారు. ఎన్నికల ప్రక్రియలో అసాంఘిక శక్తులు చొరబడే ప్రమాదం ఉన్నందునా .. వారికి ముందుగానే హెచ్చరికలు జారీ చేయడానికే కవాతు నిర్వహిస్తున్నట్లు డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి చెప్పారు. ప్రజలకు రక్షణ కల్పించే బాధ్యత పోలీసులదేనని, ప్రతి ఒక్కరూ నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ పోలీసు కమాండెంట్ ప్రదీప్ వర్మ, సీఐలు విశ్వనాథరెడ్డి, ఉలసయ్య, కుళ్లాయప్ప, రవిశంకర్‌రెడ్డి, శ్రీనివాసులు, సుదర్శన్ ప్రసాద్, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

ఘర్షణలో గాయపడ్డ వ్యక్తి మృతి



పురుషోత్తం (ఫైల్‌ఫొటో)

బంగారుపాళ్యం, మార్చి 10: బంగారుపాళ్యం మండలంలో ఇటీవల జరిగిన గొడవలో గాయపడ్డ పురుషోత్తం.. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. వివరాలిలా ఉన్నాయి. టేకుమంద గ్రామానికి చెందిన పురుషోత్తం, రమేష్ కుటుంబాల మధ్య బోరు మోటరు విషయమై మూడో తేదీన పొలం వద్ద గొడవ జరిగింది. రమేష్ కుటుంబసభ్యులు పురుషోత్తంను గాయపరిచారు. దీంతో అతడిని కుటుంబ సభ్యులు ప్రభుత్వాస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమించడంతో చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి.. అక్కడ్నుంచి తిరుపతిలోని స్విమ్స్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి పురుషోత్తం (56) మృతిచెందాడు. ఇతడికి ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య జగదాంబ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రమేష్ కుటుంబసభ్యులపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెడ్లు చెప్పినవాళ్లకే పదవులు, వర్కులు ఇచ్చా

- భావోద్వేగానికి గురైన డిప్యూటీ సీఎం నారాయణస్వామి

పెనుమూరు, మార్చి 10: 'పెనుమూరు మండలంలోని రెడ్లు చెప్పిన వాళ్లకే నేను బీఫారాలు, పదవులు, వర్కులు ఇచ్చాను. అయితే ఈ రోజు బాధతో మాట్లాడుతున్నా' అని డిప్యూటీ సీఎం నారాయణస్వామి భావోద్వేగానికి గురయ్యారు. పెనుమూరులోని డీసీసీబీ బ్రాంచ్‌ను ఆదివారం డిప్యూటీ సీఎంతో కలిసి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రారంభించారు. అనంతరం బస్టాండులో జరిగిన సభలో డిప్యూటీ సీఎం మాట్లాడుతూ తానెవరికీ అన్యాయం చేయలేదన్నారు. రానున్న ఎన్నికల్లో తన కుమార్తె కృపాలక్ష్మీని గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా నారాయణస్వామి వర్గీయులను స్టేజిపైకి ఆహ్వానించకపోవడంపై నిరుత్సాహానికి లోనయ్యారు. ఇదిలా వుండగా నారాయణస్వామి వర్గీయులు ఏర్పాటుచేసిన ఫ్లెక్సీల్లో ఎన్ఆర్‌ఐ సలహాదారు జ్ఞానేంద్రరెడ్డి ఫొటో వేయలేదు. అదేవిధంగా జ్ఞానేంద్రరెడ్డి వర్గీయులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల్లో నారాయణస్వామి వర్గీయులకు చెందిన మండల వైసీపీ కన్వీనర్ ఫొటో వేయలేదు. దీంతో ఇరువర్గాల వారు వాగ్వావాదాలకు దిగారని సమాచారం. ఇక, స్టేజీపై డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఎంపీ రెడ్డెప్పకు ఓ మూలన కుర్చీలు వేశారు. బీసీ వర్గానికి చెందిన జడ్పీటీసీ దొరస్వామి కూడా నిలబడే ఉన్నారు. ఈ పరిణామాలను నారాయణస్వామి వర్గీయులు జీర్ణించుకోలేకపోయారు. ఈ సభలో డీసీసీబీ ఛైర్‌పర్సన్ రెడ్డెమ్మ, నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త కృపాలక్ష్మి, నేతలు దయాసాగర్‌రెడ్డి, యశోదారెడ్డి, హేమలత, విజయకుమార్‌రెడ్డి, గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి క్షేత్రానికి కల్యాణ శోభ



ఆది దంపతుల వివాహ వేడుకకు ముస్తాబైన పెండ్లి మండపం

శ్రీకాళహస్తి, మార్చి 10: శ్రీకాళహస్తీశ్వరాలయ మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం వేకువ జామున 3.30 గంటలకు ఆదిదంపతుల కల్యాణోత్సవం జరగనుంది. ఇందుకోసం శ్రీకాళహస్తి పట్టణంలోని కైకాలవారి పెండ్లి మండపాన్ని సుందరంగా ముస్తాబు చేశారు. నెహ్రూ వీధి, నగిరి వీధుల్లో భక్తజనులు, పెళ్లిబృందాలు విడిది చేయడానికి బారికేడ్లను ఏర్పాటు చేశారు. మరోవైపు ఆదివారం సాయంత్రం నుంచే క్షేత్రానికి కల్యాణ శోభ సంతరించుకుంది. కల్యాణోత్సవ ఘడియల్లో పెళ్లి చేసుకోవడానికి పలు జంటలు తరలివచ్చాయి. ఈ క్రమంలో బాల్య వివాహాలు జరక్కుండా అధికారులు ప్రత్యేక నిఘా పెట్టారు. అర్ధరాత్రి 12 గంటల ప్రాంతంలో ముక్కంటీశుడిని గజవాహనంపై, జ్ఞాన ప్రసూనాంబదేవిని సింహ వాహనంపై అధిష్ఠింపజేశారు. అనంతరం ఊరేగింపుగా పెండ్లి మండపం వద్దకు బయల్దేరారు.

ఆలయాన్ని వీడి.. ఊర్లోకి వచ్చి..

దేశంలో ఎక్కడా లేనివిధంగా దేవుళ్లు.. ఆలయాన్ని వీడి, ఊర్లోకి వచ్చి వివాహం చేసుకోవడం ఒక్క శ్రీకాళహస్తిలో మాత్రమే జరుగుతుంది. ఈ ఉత్సవానికి శాశ్వత ఉభయదారులుగా కైకాల వంశస్తులు వ్యవహరిస్తున్నారు.


నేడు టీటీడీ బోర్డు సమావేశం

- దాదాపు 25 అంశాలపై చర్చించనున్న సభ్యులు

తిరుమల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశం సోమవారం తిరుమలలో జరుగనుంది. బోర్డు ఛైర్మన్ భూమన కరుణాకరరెడ్డి నేతృత్వంలో సభ్యులు దాదాపు 25 అంశాలతో రూపొందించిన అజెండాపై చర్చించి, తీర్మానాలు చేయనున్నారు. ఆలయంలోని సన్నిధితీర్థ పీఠం, కొలువు పీఠాలపై బంగారు తాపడంతో రాగి రేకులను ఏర్పాటు చేసే అంశంతోపాటు వసతి గృహాలు, పీఏసీ-1 మరమ్మతులు, ముడి సరుకుల కొనుగోళ్లు, బాలాజీనగర్ సమీపంలో సుమారు రూ.1.5 కోట్లతో ఫెన్సింగ్ ఏర్పాటుపై చర్చించనున్నట్టు సమాచారం. అలాగే రూ.14 కోట్లతో తిరుమలలోని ఉద్యోగుల క్వార్టర్స్ మరమ్మతులు,వివిధ జాతీయ బ్యాంకుల్లో బంగారు నిల్వలు, వాటిపై వచ్చే వడ్డీ పెంపునకు తీసుకోవాల్సిన చర్యలు,ఉద్యోగాల భర్తీ వంటి అంశాలపై చర్చించనున్నట్టు తెలిసింది. కాగా, ఎన్నికల కోడ్ సమీపిస్తున్న క్రమంలో ఇదే టీటీడీ చివరి బోర్డు సమావేశమనే చర్చ నడుస్తోంది.

రాజకీయ వికలాంగుడు చంద్రబాబు

- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి విమర్శ




మున్సిపల్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి తదితరులు

కుప్పం, మార్చి 10: 'చంద్రబాబు రాజకీయ వికలాంగుడు. పొత్తులులేకుండా నిలబడలేడు పాపం' అని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. కుప్పంలో రూ.5 కోట్లతో నిర్మించిన మున్సిపల్ కార్యాలయ భవనాన్ని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదివారం ప్రారంభించారు. అలాగే కుప్పం చెరువుకట్ట చుట్టూ నిర్మించిన ఫెన్సింగ్, సింగిల్‌విండో భవనాన్ని కూడా ప్రారంభించారు. అనంతరం చేయూత కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ భరత్, జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు, ఎంపీ రెడ్డెప్ప, పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ, కుప్పం మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ సుధీర్, రెస్కో ఛైర్మన్ సెంథిల్‌కుమార్, ఏఎంసీ ఛైర్మన్ విద్యాసాగర్, మెప్మా పీడీ రాధమ్మ పాల్గొన్నారు.

కొమరగుంటలో జల్లికట్టు







వెదురుకుప్పం, మార్చి 10: వెదురుకుప్పం మండలం కొమరగుంటలో ఆదివారం జల్లికట్టు నిర్వహించారు. అల్లిని ఏర్పాటు చేసి, వివిధ రకాల పట్టీలను కోడెగిత్తల కొమ్ములకు కట్టి అల్లి వైపు వదిలారు. అప్పటికే అల్లిలో ఉన్న యువకులు కోడెగిత్తలను నిలువరించే ప్రయత్నం చేశారు. నిలువరించి పట్టీలను దక్కించుకునే క్రమంలో యువకులు కొందరు గాయపడ్డారు. జల్లికట్టు నిర్వహణతో ఆ గ్రామంలో జన సందడి ఏర్పడింది.

నేటి నుంచి రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్



ఎంఈవోలతో సమీక్షిస్తున్న డీఈవో దేవరాజులు

గంగవరం, మార్చి10: గంగవరంలోని మదర్‌థెరీసా కళాశాలలో సోమవారం నుంచి 13వ తేదీ వరకు రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ మనక్ ప్రాజెక్ట్ కాంపిటీషన్స్ ఉంటాయని డీఈవో దేవరాజులు తెలిపారు. గంగవరం హైస్కూల్‌లో ఆదివారం ఎంఈవోలు, ఇన్‌స్పైర్ కమిటీ సభ్యులతో ఆయన సమీక్షించారు. విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకతను వెలికితీసి బాల మేధావులను తయారు చేయడమే ఇన్‌స్పైర్ మనక్ లక్ష్యమన్నారు. రాష్ట్ర అధికారులు, జిల్లా అధికారులతో పాటు ఢిల్లీ నుంచి అబ్జర్వర్లు కూడా వస్తారన్నారు. బాలురకు, గైడ్ టీచర్లకు పలమనేరులోని లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో, బాలికలకు, ఉమెన్ గైడ్ టీచర్లకు ఎలినాబెటిని స్కూల్, పలమనేరు హైస్కూల్‌లో వసతి ఏర్పాటు చేశామన్నారు. డీవైఈవో చంద్రశేఖర్, డీఎస్‌వో రమణ, ఎంఈవోలు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

సిద్ధం సభకోసం..!

- 300 కిలోమీటర్ల దూరంలో ట్రాఫిక్ ఆంక్షలు
- సూళ్లూరుపేటలో భారీ వాహనాలు ఆపేసిన పోలీసులు





హైవేపై వాహనాలు ఆపి పార్కింగ్‌కు పంపుతున్న పోలీసులు - మాంబట్టు సెజ్‌లో నిలిపేసిన వాహనాలు

సూళ్లూరుపేట, మార్చి 10: బాపట్ల జిల్లా మేదరమెట్లలో జరిగే సిద్ధం సభ కోసం 300 కిలోమీటర్ల దూరంలోని తిరుపతి జిల్లా సూళ్లూరుపేటలో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ఉదయం 10గంటల నుంచే నెల్లూరు వైపు వెళ్లే భారీ వాహనాలను హైవేలోని సూళ్లూరుపేట టోల్‌ప్లాజా వద్ద, తడ మండలం కొండూరు సమీపంలో అపాచి క్రాస్ రోడ్డు వద్ద సీఐ మధుబాబు ఆధ్వర్యంలో పోలీసులు ఆపేశారు. వీటిని మాంబట్టు సెజ్‌లో ఉన్న ఖాళీ స్థలాల్లోకి మళ్లించారు. సీఎం సభ జరుగుతుందని, సాయంత్రం వరకు ఇక్కడే ఉండాలని హుకుం జారీ చేశారు. హైవేపై తాము వెళుతుంటే ట్రాఫిక్ ఇబ్బంది ఏంటని వాహనాల డ్రైవర్లు లబోదిబోమన్నా ఫలితం లేకపోయింది. దీనివల్ల డ్రైవర్లు, క్లీనర్లకు తాగునీరు, మధ్యాహ్నం భోజనం లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.24 కోట్లు

తిరుమల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : తిరుమల వేంకటేశ్వర స్వామి హుండీ ఆదాయం రూ.3.24 కోట్లు లభించింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శనివారం లెక్కించి ఆదివారం ఉదయం ప్రకటించింది. ఇక, శనివారం 68,446 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 28,549 మంది తలనీలాలు సమర్పించారు.

ఎస్వీ జూపార్కులో సీసీ కెమెరాల ఏర్పాటు

మంగళం, మార్చి 10 : ఎస్వీ జూపార్కులో కొత్తగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. కొన్ని రోజుల క్రితం ఓ వ్యక్తి సింహాల ఎన్‌క్లోజర్‌లో దూకి సింహం దాడిలో మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ఘటన తర్వాత జూ అధికారులు సందర్శకుల రక్షణ చర్యలు చేపట్టారు. అందులో భాగంగా పులులు, సింహాల ఎన్‌క్లోజర్లు, వాటి వద్దకు వెళ్లేదారుల్లో 16 సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే జూలో 60 సీసీ కెమెరాలు ఉన్నట్లు క్యూరేటర్ సెల్వం తెలిపారు. దాదాపు రూ.2లక్షలతో కొత్త కెమెరాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వీటితో పాటు జంతువులు వేసవి తాపం తట్టుకునే విధంగా స్ప్రింక్లర్స్, గ్రీన్‌షేడ్ నెట్, వట్టివేర్ల తెర, కూలర్లు, ఫాగర్స్, ఎగ్జిట్ ఫ్యాన్లు, గ్లూకోజ్ తెప్పించామన్నారు.

రామనామస్మరణతో పులకించిన సప్తగిరులు



తిరుమల, మార్చి10(ఆంధ్ర జ్యోతి): లోకకల్యాణం కోసం శ్రీవారిని ప్రార్థిస్తూ తిరుమల నాదనీరాజనం వేదికపై ఆదివారం ఉదయం జరిగిన 8వ విడత అయోధ్యకాండ అఖండ పారాయణం భక్తులను భక్తిసాగరంలో ముంచెత్తింది. ఉదయం 7 నుంచి 9 గంటల వరకు ఈ కార్యక్రమంలో అయోధ్యకాండలోని 26 నుంచి 30వ సర్గ వరకు ఉన్న 156 శ్లోకాలు, యోగవాశిష్టం, ధన్వంతరి మహామంత్రంలోని 25 శ్లోకాలు కలిపి మొత్తం 181 శ్లోకాలను పారాయణం చేశారు. ధర్మగిరి వేదపాఠశాల పండితులు రామానుజాచార్యులు, అనంత గోపాలకృష్ణ, మారుతి శ్లోక పారాయణం చేశారు. ధర్మగిరి వేద పాఠశాల, ఎస్వీ వేద విశ్వవిద్యాలయం అధ్యాపకులు, ఎస్వీ ఉన్నత వేదాధ్యయన సంస్థకు చెందిన వేదపారాయణదారులు, జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయానికి చెందిన శాస్త్ర పండితులు పాల్గొన్నారు. అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారులు శ్రీనివాస్ బృందం 'వందనము రఘువందన సేతు.., రామ రామ అన రాదే..' అను కీర్తనలను రసరమ్యంగా ఆలపించారు.

తిరుమలలో వృద్ధుడి అదృశ్యం



హనుమంతరాయప్ప (ఫైల్ ఫొటో)

తిరుమల, మార్చి10 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో కర్ణాటకకు చెందిన ఓ వృద్ధుడు కనిపించకుండా పోయాడు. తిరుమల వన్‌టౌన్ పోలీసుల వివరాల మేరకు.. కర్ణాటక ముఖనేహల్లికి చెందిన హనుమంతరాయప్ప(64)తో కలిసి కుమారుడు సిద్దరాజు, కుటుంబ సభ్యులు జనవరి 29వ తేదీన శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చారు. స్వామి దర్శనానికి క్యూ ద్వారా వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోని 18వ కంపార్టుమెంట్‌కు చేరుకున్నారు. బాత్‌రూమ్‌కు వెళ్లివస్తానని చెప్పిన హనుమంతరాయప్ప తిరిగి రాలేదు. పరిసరాలతో పాటు తిరుమల, సొంతూరులో ఎంత గాలించినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో తిరిగి తిరుమలకు చేరుకుని వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. హనుమంతరాయప్ప వివరాలు తెలిసిన వారు 0877 2289027, 94407 96771లకు తెలియజేయాలని పోలీసులు ఆదివారం ఓ ప్రకటన ద్వారా కోరారు.

ఎలా ఉన్నారు?

- ఎన్టీఆర్ రాజుకు నందమూరి కుమారుడి పరామర్శ



తిరుమల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ వీరాభిమాని అయిన ఎన్టీఆర్ రాజు(రామచంద్రరాజు)ను తన కుమార్తె రూపతో కలిసి నందమూరి కుమారుడు మోహన్‌కృష్ణ పరామర్శించారు. తారకరత్న వర్ధంతి సందర్భంగా శనివారం తిరుమలకు వచ్చిన వీరు ఆదివారం స్థానికుడైన రాజును కలిశారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన్ను పరామర్శించి, పాతరోజులను గుర్తుచేసుకున్నారు. త్వరలోనే ఆరోగ్యం కుదుటపడుతుందని ధైర్యం చెప్పారు. వీరివెంట ఫిలిమ్ చాంబర్ సెక్రటరీ ప్రసన్నకుమార్, టీడీపీ స్టేట్ మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్‌వర్మ తదితరులున్నారు.

మగ బిడ్డను పెంచుకోవాలనే ఎత్తుకొచ్చేశా

- కిడ్నాపర్ ఇజ్జాడ దేవి



బిడ్డను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్ పటేల్

తిరుపతి, క్రైం మార్చి 10: 'నాకు ఆడబిడ్డ ఉంది. మగబిడ్డను పెంచుకోవాలనే తిరుమల నుంచి ఎత్తుకొచ్చేశా' అని నిందితురాలు ఇజ్జాడ దేవి మీడియాకు చెప్పింది. బాలుడిని తిరుపతికి తీసుకొచ్చి లాడ్జిలో ఉండగా పోలీసులు తనను పట్టుకున్నారని పేర్కొంది. ఈ బాలుడిని మరో వ్యక్తికి అప్పగించడానికి ఫోన్ ద్వారా ఆమె ప్రయత్నించింది. అతను రావడం ఆలస్యం కావడంతోనే పోలీసులకు చిక్కింది.

తల్లి ఒడికి చిన్నారి చేరిందిలా..

పోలీసులు అప్రమత్తమవ్వడంతో కొద్ది గంటల వ్యవధిలోనే కిడ్నాప్ గురైన అభినయ్ (3) తల్లి ఒడికి చేరాడు. తిరుపతిలో ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ మీడియాకు వివరాలను తెలిపారు. జోగులాంబ గద్వాల్ జిల్లాలోని ఐజ గ్రామానికి చెందిన నగేష్, పరిమళ దంపతులు తమ ఇద్దరు కుమారులు అక్షయ్ (6), అభినయ్(3), కుటుంబీకులతో కలిసి శ్రీవారి దర్శనార్థం ఆదివారం మధ్యాహ్నం రెండు గంటలకు తిరుమలకు వచ్చారు. గది లభించక పోవడంతో పీఏసీ-2లో సేదతీరారు. ఆ సమయంలో తూర్పు గోదావరి జిల్లా రాజానగరానికి చెందిన ఇజ్జాడ దేవి తన వద్ద ఉన్న మొబైల్ ఫోన్‌తో అభినయ్‌ని ఆడిస్తూ అక్కడి నుంచి ఎత్తుకొచ్చేసింది. మధ్యాహ్నం 3.30 గంటల ప్రాంతంలో బిడ్డ కనిపించడం లేదని గుర్తించిన తల్లిదండ్రులు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. మరోవైపు బిడ్డను తిరుమల నుంచి దేవి.. ఓ జీపులో తిరుపతికి తీసుకొచ్చేసింది. కెన్సెస్ నుంచి సంధ్య థియేటర్ రోడ్డులోకి వెళ్లి అక్కడున్న ఆర్టీసీ ఉద్యోగుల రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఆవుల ప్రభాకర్ యాదవ్‌ను అద్దె గది కావాలని అడిగింది. పెద్దకాపు లేఅవుట్‌లో ఉంటాయని చెప్పడంతో అటువైపు వెళ్లింది. కొంతసేపటికి ఆర్టీసీ డిపో మేనేజర్ ద్వారా వాట్సప్‌లో కిడ్నాప్ వివరాలు చూసిన ప్రభాకర్ వెంటనే ఈ విషయాన్ని సీఐ జగన్‌మోహన్‌రెడ్డికి తెలియజేశారు. ఆయన.. ఈస్ట్, తిరుమల టూటౌన్ పోలీసులతో కలిసి పెద్దకాపు లేఅవుట్‌లోని లాడ్జీలలో గాలించి నిందితురాలిని, బిడ్డను గుర్తించారు. రాత్రి సుమారు ఎనిమిది గంటలకు ఆమెను అదుపులోకి తీసుకున్నారు. బిడ్డను తల్లిదండ్రులకు ఎస్పీ అప్పగించారు. స్వల్ప వ్యవధిలోనే కిడ్నాప్ కేసును ఛేదించిన సీఐ జగన్‌మోహన్‌రెడ్డిని, తిరుమల టూటౌన్ సీఐ సత్యనారాయణ బృందం, తిరుమల వన్‌టౌన్ కానిస్టేబుల్ కె.మునిశేఖర్‌తోపాటు ఆర్టీసీ నేత ప్రభాకర్ యాదవ్‌ను ఎస్పీ అభినందించారు.



నిందితురాలు దేవి

- ద్విచక్రవాహనం చోరీ కేసులో..

ఏఆర్ కానిస్టేబుల్ సహా ముగ్గురి అరెస్టు



నిందితులను కుప్పం కోర్టులో హాజరుపరిచేందుకు తీసుకెళ్తున్న పోలీసులు (మధ్యలో ఉన్న వ్యక్తి గాంధీ)

రామకుప్పం, మార్చి 10: రామకుప్పం మండలం తిమ్మసముద్రం కాలనీ వద్ద యువకుడిని బెదిరించి ద్విచక్రవాహనాన్ని చోరీ చేసి తీసుకెళ్లిన ఘటనలో ఏఆర్ కానిస్టేబుల్ సహా ముగ్గురిని అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ శివకుమార్ తెలిపారు. ఆయన తెలిపిన ప్రకారం.. గత నెల 28న కర్ణాటక సరిహద్దు రాజుపేటక్రాస్ నుంచి వస్తున్న మండలంలోని మిట్టపల్లెకు చెందిన ప్రవీణ్‌ను ముగ్గురు వ్యక్తులు బెదిరించి ద్విచక్రవాహనాన్ని తీసుకెళ్లిపోయారు. తన బైకుకోసం వెతుకుతున్నా కనిపించలేదు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం తన స్నేహితులతో కలిసి ప్రవీణ్ రాజుపేటక్రాస్‌కు బయలుదేరారు. తిమ్మసముద్రం సమీపంలోని అంబేడ్కర్ గురుకుల విద్యాలయం ఎదురుగా స్పీడ్‌బ్రేకర్ వద్ద ముగ్గురు వ్యక్తులు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా గమనించారు. వెంటనే వారిని తన స్నేహితులతో కలిసి చుట్టుముట్టి చూడగా, తన ద్విచక్రవాహనాన్ని తీసుకెళ్లింది వారేనని, ఆ ద్విచక్రవాహనం కూడా తనదేనని ప్రవీణ్ గుర్తించారు. తన స్నేహితుల సహకారంతో ద్విచక్రవాహనంతోపాటు ఆ ముగ్గురిని పట్టుకుని రామకుప్పం పోలీసులకు అప్పగించారు. కుప్పం మండలం అడవిబూదుగూరుకు చెందిన ఏఆర్ కానిస్టేబుల్ గాంధీ(32), ఎ.కొత్తపల్లెకు చెందిన సోమశేఖర్(24), గెరికచిన్నేపల్లెకు చెందిన మోహన్(26)గా వీరిని గుర్తించారు. తన తల్లి గత డిసెంబరు నెలలో చనిపోవడంతో గాంధీ మానసికంగా కుంగిపోయి, విధులకు హాజరు కాకుండా, మద్యానికి అలవాటు పడ్డాడు. సులువుగా డబ్బు సంపాదించాలని సోమశేఖర్, మోహన్‌తో కలిసి వ్యూహరచన చేశాడు. దీనిలో భాగంగా గత నెల 28న ద్విచక్రవాహనాన్ని తీసుకెళ్ళిపోయారు. బాధితుడు ప్రవీణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం పోలీసులు కేసు నమోదు చేసి, నిందితులను అరెస్టు చేశారు. నిందితులను ఆదివారం కుప్పం కోర్టులో హాజరుపరిచారు.

కొనసాగుతున్న గజ దాడులు

- గుట్టపాళ్యంలో వరి పంట ధ్వంసం



ఏనుగు నాశనం చేసిన వరిపంట

ఐరాల(కాణిపాకం), మార్చి 10: ఐరాల మండలం గుట్టపాళ్యంలో గజదాడులు కొనసాగుతున్నాయి. గుంపు నుంచి తప్పిపోయిన ఒంటరి ఏనుగు పంట పొలాలపై దాడులకు పాల్పడుతోంది. శనివారం రాత్రి ఒంటరి ఏనుగు గుట్టపాళ్యానికి చెందిన శంరయ్య, సురేష్, కార్తీక్, విజయ్‌కుమార్‌కు చెందిన నాలుగు ఎకరాల వరి పంటను తొక్కి నాశనం చేసింది. అటవీ ప్రాంతానికి సమీపంలో ఉండటంతో ఏనుగు పంట పొలాలను నాశనం చేసి తిరిగి అడవిలో తిష్ఠ వేస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఎప్పుడు దాడి చేస్తుందోనని గ్రామస్తులు భయభ్రాంతులకు గురవుతున్నారు. రాత్రి సమయంలో పొలాల వద్దకు వెళ్లడానికి రైతులు భయపడుతున్నారు. ఏనుగులు గ్రామాల వైపు రాకుండా అటవీ ప్రాంతం వద్ద సోలార్ ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు. ఈ సందర్భంగా బీటు అధికారి లావణ్య మాట్లాడుతూ ఏనుగును ట్రాకర్ల సహాయంతో సదుం మండలం చీకలచేను అటవీ ప్రాంతానికి తరిమివేసినట్లు తెలిపారు.

అన్నదానానికి రూ.లక్ష విరాళం



విరాళం అందిస్తున్న దాత

ఐరాల(కాణిపాకం), మార్చి 10: కాణిపాక క్షేత్రంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి హైదరాబాద్ చంపాపేటకు చెందిన విద్య రూ.1,00,116 ఆదివారం విరాళంగా అందించారు. విరాళదాతను సూపరింటెండెంట్ వాసు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

మదనపల్లెలో చీటీల వ్యాపారి నిలదీత

మదనపల్లె టౌన్, మార్చి 10: ఐదేళ్లుగా నమ్మి చీటీలు వేస్తున్నాం..ఇప్పుడు హఠాత్తుగా డబ్బులు లేవని చెబితే పోలీసులకు ఫిర్యాదు చేయాల్సి ఉంటుందని 100 మంది చీటీల బాధితులు చీటీల వ్యాపారిని నిలదీశారు. ఆదివారం స్థానిక కదిరిరోడ్డు ఎక్స్‌టెన్షన్(ప్రభుత్వాస్పత్రి ఎదుట వీధి)లో చీటీల వ్యాపారి కృష్ణారెడ్డి ఇంటి ముందు 100 మంది దాకా చీటీలు వేసిన బాధితులు గుమికూడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కృష్ణారెడ్డి వద్ద తాము ఐదేళ్లుగా చీటీలు వేసి ప్రతి నెలా డబ్బులు చెల్లించామన్నారు. అంతకు ముందు పట్టణానికి చెందిన ఓ వ్యక్తి భరోసా ఇవ్వడంతో చీటీలు వేశామని, కాని కృష్ణారెడ్డి కరోనా సమయం నుంచి తమకు సరిగ్గా డబ్బులు చెల్లించడం లేదన్నారు. తాము డబ్బులు ఇస్తేనే సరి..లేకుంటే పోలీసులకు ఫిర్యాదు చేస్తామని బాధితులు హెచ్చరించారు. దీంతో కృష్ణారెడ్డి మాట్లాడుతూ తన పేరిట కొన్ని ఆస్తులు వున్నాయని వాటిని విక్రయించి చీటీలు కట్టిన వారందరికి ఇవ్వాల్సిన సొమ్ములు చెల్లిస్తానని ఈనెల 25వ తేదీ వరకు సమయం కావాలని విజ్ఞప్తి చేశారు. దీంతో చీటీల బాధితులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ విషయమై వన్ టౌన్ పోలీసులను వివరణ కోరగా తమకు బాధితుల నుంచి ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

కొడవలితో దాడి చేసినా తూతూ మంత్రం కేసులేనా..?

మదనపల్లె టౌన్, మార్చి 10: తమపై కొడవలితో దాడి చేసినా నిందితులపై పోలీసులు నామమాత్రంగా కేసులు పెట్టారని వాల్మీకిపురం మండలం ఎర్రగుంట్లబావికి చెందిన బాధితులు ఆరోపించారు. ఆదివారం స్థానిక మిషన్‌కాంపౌండులో బాధితులు ఎం. శ్రీనివాసులు, నాగరత్న, వారి కుమారుడు శివ విలేకర్లతో మాట్లాడుతూ తాము ఎర్రగుంట్లబావి గ్రామంలో నివశిస్తున్నామని, తమపై అదే గ్రామానికి చెందిన ఏడుగురు పదిహేనేళ్లుగా కక్ష సాధింపుతో పోలీసులకు ఫిర్యాదు చేసి సతాయిస్తున్నారన్నారు. గత శుక్రవారం తాము ఇదేమని ప్రశ్నించగా నిందితులు తమపై కొడవలితో దాడి చేశారన్నారు. గాయపడిన తాము వాల్మీకిపురం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స చేయించుకుని పోలీసులకు ఫిర్యాదు చేసినా నిందితులు మళ్లీ తమను బెదిరిస్తున్నారన్నారు. పోలీసులు తమకు న్యాయం చేయాలని కోరుతున్నామన్నారు.

వ్యక్తిపై కత్తితో దాడి

పెద్దమండ్యం, మార్చి 10: ఓ వ్యక్తిపై కత్తితో దాడి చేసిన సంఘటన పెద్దమండ్యం సమీపంలో చోటుచేసుకుంది. పెద్దమండ్యం పోలీసుల కథనం మేరకు పెద్దమండ్యం గ్రామ పరిధిలోని బురుజు కురవపల్లికు చెందిన కె. లక్ష్మీపతి(23)పీపు పై గెల్సవారిపల్లి కు చెందిన బి. శ్రీకాంత్(19) కత్తితో శనివారం రాత్రి దాడి చేశాడు. ఈ దాడితో తీవ్రంగా గాయపడి అస్వస్థతకు గురైన లక్ష్మీపతిని 108 వాహనంతో మదనపల్లి జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతి తరలించారు. బాధితుడి తల్లి భూదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దమండ్యం ఎస్ఐ చెన్నకేశవ ఆదివారం తెలిపారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేషస్పందన



రోగులకు మందులు వితరణ చేస్తున్న ఆర్యవైశ్య నేతలు

మదనపల్లె అర్బన్, మార్చి 10: స్థానిక ఆర్యవైశ్య హాస్టల్‌లో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేషస్పందన లభించింది. మదనపల్లె ఆర్యవైశ్యసంఘం అధ్యక్షుడు ఓంప్రకాష్, వాసవీక్లబ్ సెక్రటరీ పి. అమరనాథ్, ఉపాధ్యక్షుడు వీవీ కృష్ణారావు ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఇందులో 200మందికి పైగా వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ముఖ్యంగా మదనపల్లె ఆర్యవైశ్య సంఘం, వాసవీక్లబ్, వనితాక్లబ్ ఆధ్వర్యంలో బెంగళూరుకు చెందని వివిదాస్ సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రికి చెందిన డాక్టర్లు ఆర్ వినయ్, కీర్తి, ఆర్ నవనీత్ శ్రీనిధి, పరమేశ్వరరెడ్డి, టి, సునితలతోపాటు వైద్యసిబ్బంది రోగులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు, వాసవీక్లబ్ సభ్యులు, వనితాక్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులు ఐక్యమత్యం చాటాలి



జిల్లా ఆర్యవైశ్య సంఘం నాయకులను సన్మానిస్తున్న మదనపల్లె ఆర్యవైశ్యులు

మదనపల్లె అర్బన్, మార్చి 10: ఆర్యవైశ్యులు ఐక్యమత్యం చాటాలని ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ (వార్మ్)ఏపీ అధ్యక్షుడు జక్కా సుబ్బరాజు అన్నారు. ఆదివారం స్థానిక బొంతవారి కళ్యాణమండపంలో శ్రీవాసవీట్రస్టు అధ్యక్షుడు మాకంఅశోక్‌కుమార్ ఆధ్వర్యంలో ఆర్యవైశ్యుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఆర్యవైశ్యులు అధికంగా ఉన్నారని రాబోవు ఎన్నికల్లో పార్టీలకు అతీతంగా ఓటింగ్‌లో పాల్గొన్నాలని కోరారు. కాణిపాకం ట్రస్టు సభ్యుడు నరసంహులు శెట్టి మాట్లాడుతూ ఆర్యవైశ్యుల కోసం తాను అండగా ఉంటామన్నారు. అంతకముందే ఆర్యవైశ్య సంఘం నాయకులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు గోపీనాథ్, శ్రీనివాసులు, నరసంహులు, మదనపల్లె నాయకులు చంద్రమౌళి, పాండు, కిషోర్ పాల్గొన్నారు.

ఘనంగా సావిత్రి బాయి పూలే వర్ధంతి



సావిత్రిబాయిపూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

పీలేరు, మార్చి 10: దేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలైన సావిత్రి బాయి పూలే 127వ వర్ధంతిని ఆదివారం పీలేరులోని ప్రజాసంఘాలు ఘనంగా నిర్వహించాయి. బంగారంచు ఎస్సీ కాలనీలో జరిగిన కార్యక్రమంలో నాయకులు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పీలేరులోని బహుజన బిల్డింగ్ వర్కర్స్ అసోసియేషన్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు బలరాం ఆమె సేవలు, త్యాగాలను అందరికీ వివరించారు వేర్వేరుగా జరిగిన ఈ కార్యక్రమాల్లో మాలమహానాడు నాయకులు తుమ్మల ధరణీకుమార్, గట్టప్ప, నగరిమడుగు సుభాష్, ఆనంద్, బాలగంగాధర్, విజయ్, 'బాస్' నాయకులు ముల్లంగి కృష్ణయ్య, జాతీయ అంబేద్కర్ సేవా సంఘం నేత మచ్చ రెడ్డయ్య, బహుజన బిల్డింగ్ వర్కర్స్ అసోసియేషన్ నాయకులు ప్రభాకర్‌రాజు, సయ్యద్ అలీబేగ్ పాల్గొన్నారు.

ఎన్నికల్లో ఆదరించండి..అభివృద్ధి చేస్తా!

● బాలంవారిపల్లెలో నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి



ప్రజలతో మాట్లాడుతున్న నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి

పీలేరు, మార్చి 10: ఎన్నికల్లో 'ఒక్కసారి ఆదరించండి.. అభివృద్ధి చేసి చూపిస్తా' అంటూ టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. పీలేరు మండలం బాలంవారిపల్లె పంచాయతీ టీడీపీ, జనసేన శ్రేణులతో కలిసి ఆదివారం ఆయన 'బాబు ష్యూరిటీ..భవిష్యత్తు గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ కుటుంబాన్ని పీలేరు ప్రజలు 2009లో మాత్రమే ఆదరించారని, అప్పుడు లభించిన అవకాశంతో నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపామన్నారు. 2014, 2019 ఎన్నికల్లో తమను ప్రజలు ఆదరించకపోవడంతో ఆ అభివృద్ధిని కొనసాగించలేకపోయామని, వచ్చే ఎన్నికల్లో ఆదరిస్తే చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్‌ల సహకారంతో పీలేరు నియోజకవర్గాన్ని మరోమారు అభివృద్ధి పథంలో నడుపుతానన్నారు. వైసీపీ అధికారం లోకి వచ్చిన తరువాత ఎస్సీల సంక్షేమం కోసం టీడీపీ ప్రభుత్వం అమలు చేసిన 27 పథకాలను రద్దు చేసి దళితులకు స్వయం ఉపాధి పథకాలు అందకుండా చేసిందన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో విజ్ఞతతో ఆలోచించి అభివృద్ధికి కట్టుబడిన టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థులను బలపరచాలన్నారు. అనంతరం టీడీపీ ప్రకటించిన సూపర్ సిక్స్ పథకా లతో కూడిన కరపత్రాలు పంచుతూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పీలేరు పట్టణానికి చెందిన ఉపాధ్యాయ సంఘ నేతలు రాచపల్లె శ్రీనివాసులు, రాచపల్లె కృష్ణమూర్తి మాతృమూర్తి రాచపల్లె సుబ్బరత్న మ్మ మృతి చెందిన విషయం తెలుసుకుని ఆమె భౌతిక కాయానికి నివా ళులర్పించారు. అదే విధంగా ఆర్యవైశ్య సంఘ నాయకులు అమర కుమారుడు లిఖిత్ మరణించిన విషయం తెలియడంతో కిశోర్ కుమార్ రెడ్డి అతని మృతదేహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో బాలంవారిపల్లె మాజీ సర్పంచ్ సురేంద్రరెడ్డి, వైస్ సర్పంచ్ ఆనంద రెడ్డి, టీడీపీ నాయకులు పవన్ కుమార్ రెడ్డి, వెంకటరమణారెడ్డి, గుండన్న, బెల్లం ఆనంద, రవికుమార్ రెడ్డి, సహదేవ, సుధాకర్, భాను, రఘునాథరెడ్డి, రమ ణ, అశోక్ రెడ్డి, ఎల్‌బిసీ రమణ, మస్తాన్, రాంనారాయణ రెడ్డి, బెల్లం సురేంద్ర, బెల్లం రామకృష్ణ, జయప్రకాశ్, దుబ్బా చంద్రశేఖర్, జనసేన నాయకులు కలప రవి, మోహనకృష్ణ, గజేంద్ర పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన మహల్‌రాజుపల్లె గ్రామస్థులు

కలికిరి, మార్చి 10: కేవీపల్లె మండలంలోని మహల్‌రాజుపల్లె పంచాయతీకి చెందిన 20 కుటుంబాలు శనివారం రాత్రి నగరిపల్లెలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన పార్టీలో చేరిన వారందరికీ పసుపు కండువాలు కప్పి వారిని సాదరంగా ఆహ్వానించారు. టీడీపీ గెలుపు కోసం సమష్టిగా కృషి చేయాలని కోరారు. మహల్‌రాజుపల్లె టీడీపీ నాయకుడు మదనమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ చేరికలు జరిగాయి.

యాళి వాహనంపై సిద్దేశ్వరుడు విహారం



కలకడ, మార్చి 10:కలకడ సత్యవతి నది తీరాన ఆలయంలో వెలసిన కామాక్షి సమేత సిద్దేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా స్వామి, అమ్మవార్లు యాళి వాహనంపై విహరించారు. రెడ్డిసంఘం ఆధ్వర్యంలో పుష్పాలతో అలంకరించిన ప్రభలతో కూడిన వాహనంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఉంచి మం గళవాయిద్యాలు, నెల్లూరు కోలాటాలు, బాణసంచా పేల్చుతూ ఊరేగించారు. ధర్మకర్త కె.అఖిలేష్ కార్యక్రమా లను పర్యవేక్షించారు. రెడ్డి సంఘం సభ్యులు ఎం.తిప్పారెడ్డి, కె.లక్ష్మిరెడ్డి, ఎం.నాగరాజరెడ్డి, క్రిష్ణారెడ్డి, కమలాకర్‌రెడ్డి, ప్రకాశ్‌రెడ్డి, మదన్‌మోహన్ రెడ్డి, కుమార్‌రెడ్డి, వెంకటరమణారెడ్డిలు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా మహానివేదన, త్రినేత్రధారణ



రథోత్సవంపై సిద్దేశ్వరుడు

కలకడ, మార్చి 10:కలకడ సత్యవతి నది తీరాన వెలసిన కామాక్షి సమేత సిద్దేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం స్వామివారికి మహానివేదన శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఆలయం ఎదుట ప్రసాదం తయారు చేసి భక్తులకు పంపిణీ చేశారు. తిరుణాలకు వచ్చిన వేలాది భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు, అభిషేకాలలో పాల్గొన్నారు. ఆలయంతోపాటు పరిసరాలు, తిరుణాల జరిగే ప్రదేశాలు భక్తులతో కిక్కిరిసాయి. రథోత్సవంలో భాగంగా స్వామి, అమ్మవార్లు కలకడ వీధులలో ఊరేగించారు. బొజ్జగుంటపల్లెకు చెందిన మధుసూదన్‌నాయుడు శిరీషా దంపతులు భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. ధర్మకర్త కె.అఖిలేష్, కే.శ్రీనివాసప్రసాద్, ఆలయ కమిటీ సభ్యులు మద్దిపట్ల వెంకటరమణనాయుడు, కె.రెడ్డెప్పనాయుడు, జి.శ్రీనివాసులునాయుడు, బి.మల్లికార్జుననాయుడు, ఎస్.నరసింహులు, జి.కుమార్‌నాయుడు, రామయ్యచౌదరి, రమేష్, కె.జనార్ధన్‌నాయుడు పాల్గొన్నారు.

వైభవంగా శివపార్వతుల రథోత్సవం



పెద్దతిప్పసముద్రం మార్చి 10 : స్థానిక పీటీఎంలో వెలసిన ప్రసన్న పార్వతీ సమేత విరూపాక్షేశ్వర స్వామి ఆలయంలో నాలగవ రోజైన ఆదివారం రథోత్సవ కార్యక్రమాన్ని పీటీఎంకు చెందిన ఆధ్యాత్మిక వేత్త అయిన ననగరం పట్టాభిరామయ్య ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ఉదయం నుంచి స్వామి వారికి విశేషపూజలు నిర్వహించారు. పురవీధుల్లో మల్లయ్య దొరల విన్యాసాలతో, బళ్లారి డ్రమ్స్, పండరీభజనలతోటి, కోలాటలు, పిల్లనగ్రోవి భజనలు, మేళతాళాల నడుమ స్వామి వారి రథోత్సవాన్ని పురప్రజలు చూసి తరించారు.

మాజీ ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

పీటీఎం మండలం టి.సదుం పంచాయతీ చెన్నరాయునిపల్లె వద్ద గల ప్రసన్న పార్వతీ సమేత సంగమేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం తంబళ్లపల్లె నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే ఏవీ లక్ష్మీదేవమ్మ ఆలయానికి విచ్చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో ఆమెకు మొలకలచెరువు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనాథ్‌రెడ్డిలతో పాటు ఆలయ కమిటీ నిర్వాహకులు ఆమెకు ఘనస్వాగతం పలికి తీర్థప్రసాదాలను అందచేశారు. ఆమె వెంట స్థానిక సర్పంచ్ శారద,మునిరాజ్, టీడీపీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, మాజీ జడ్పీటీసీ ఈశ్వరప్ప, కట్టా సురేంద్ర నాయుడు, మనోజ్‌జయంత్‌రెడ్డి, వెంకటరెడ్డి, పక్రుద్దీన్, వెంకట్రమణప్ప, బస్సు బయ్యారెడ్డి, బూర్లపల్లె సుధాకర్‌రెడ్డి, జంబుగానిపల్లె ఆంజనేయరెడ్డి, లు ఉన్నారు.

కన్నుల పండువగా వాళీశ్వరస్వామి తేరు



రామసముద్రం, మార్చి 10: రామసముద్రం మండలం ఆర్.నడింపల్లె పంచాయతీ బలసముద్రం గ్రామం సమీపంలో ఉన్న వాళీశ్వరస్వామి దేవాలయంలో ఆదివారం తేరు ఉత్సవాలు కన్నులపండుగగా నిర్వహించారు. ఈసందర్భంగా స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకాలంకరణ చేసి గుడి చుట్టూ ఊరేగింపు చేశారు. జడ్పీటీసీ రామచంద్రారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహిం చా రు. ఈసందర్భంగా చెంబకూరుకు చెందిన కోవ కృష్ణమూర్తి, పైగడ్డకు చెందిన మాజీ సర్పంచ్, వాళీశ్వర ఆలయ ధర్మకర్త దివంగత వాలిరెడ్డి కుమారుడు సర్పంచ్ ఉదయ్‌శంకర్‌రెడ్డి, రామసముద్రంకు చెందిన నాగేంద్రశెట్టి, శ్రీరాములపల్లె వెంకటప్ప, భక్తులకు అన్నదానం చేశారు.

గురుకుల ప్రవేశ పరీక్షలు

వాల్మీకిపురం, మార్చి 10: వాల్మీకిపురం అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఆదివారం ప్రవేశ అర్హత పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా ఐదోతరగతికి సంబంధించి 108మంది విద్యార్థులకు గాను 85మంది పరీక్షలు రాయగా, అనంతరం మధ్యాహ్నం నిర్వహించిన ఇంటర్మీడియేట్ ప్రవేశ పరీక్షలకు 92మంది విద్యార్థులు హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ కల్పన, అబ్జర్వర్ నాగవేలు పేర్కొన్నారు. ప్రవేశ పరీక్షలను స్థానిక ఎంఈవో వెంకటలక్ష్మీ తనిఖీ చేసి పర్యవేక్షించారు.

పీలేరు అక్సా మసీదులో సెహరీ ఏర్పాటు

పీలేరు, మార్చి 10: పవిత్ర రమజాన్ మాసంలో ఉపవాసాల ఉండే వారి కోసం తమ మసీదులో సెహరీ ఏర్పాటు చేసినట్లు పీలేరులోని అక్సా మసీదు కమిటీ సభుడు ఆతిఖా షఫీ తెలిపారు. సెహరీ తయారు చేసుకోలేని నిరుద్యోగులు, అవివాహితులు, బయటి ప్రాంతాలకు చెందిన వారు, కార్మికులు, ప్రయాణీకుల కోసం ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. రమజాన్ మాసంలో ప్రతిరోజూ ఉదయం 4 గంటల నుంచి సెహరీ అందుబాటులో ఉంటుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నల్లారి కిశోర్ గెలుపే ధ్యేయం



వాల్మీకిపురం మండలం తూర్పుపల్లెలో కరపత్రాలతో ప్రచారం చేస్తున్న టీడీపీ, జనసేన నాయకులు.

వాల్మీకిపురం, మార్చి 10: పీలేరు నియోజకవర్గంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి గెలుపే ధ్యేయంగా ప్రతి కార్యకర్త చిత్తశుద్ధితో కృషి చేయాలని మండల టీడీపీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం మండలంలోని మూగలమర్రి, కొత్తపల్లె, తూర్పుపల్లెలలో పార్టీ నాయకులు, కార్యకర్తలు బాబు షూరిటీ.. భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం చేపట్టి ఇంటింటా కరపత్రాలతో ముమ్మర ప్రచారం చేశారు.టీడీపీ- జనసేన మేనిఫెస్టో సూపర్ సిక్స్ సంక్షేమ పథకాల పట్ల కరపత్రాలు పంచుతూ అవగాహన కల్పించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ తామంతా ఎప్పటికీ నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి వెన్నంటే ఉంటామని, వచ్చే ఎన్నికల్లో పీలేరులో టీడీపీ జెండా ఎగరేయడం ఖాయమన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు వెంకటరమణ, మైనార్టీ అధ్యక్షుడు సయ్యద్, నాయకులు రాజేంద్రాచారి, పీవీ నారాయణ, వెంకటరమణ, చంద్రమౌళి, మురళి,డిష్ బ్రదర్స్, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

అమ్మవారికి వెండి పళ్లెం వితరణ



గుర్రంకొండ, మార్చి 10:సంతాన లక్ష్మీగా ప్రసిద్ధి చెందిన రెడెమ్మ అమ్మవారికి దాతలు వెండి పళ్లెంను వితరణగా అందజేశారు. అన్నమయ్య జిల్లా రాయచోటికి చెందిన నితిన్ రాంగోపాల్ అమ్మవారికి మొక్కుగా 494 గ్రాముల బరువు గల వెండి పళ్లెంను బహూకరించారు. ఈ పళ్లెం విలువ రూ.40 వేలు ఉంటుందని ఈవో మంజుల తెలిపారు. ఆలయ సాంప్రదాయ ప్రకారం దాతలకు అమ్మవారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలను అందజేశారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నిమ్మనపల్లి, మార్చి 10: స్థానిక జడ్పీహైస్కూల్‌లో 1973-74 బ్యాచ్ పూర్వ విద్యార్థులు 50ఏళ్ల పూర్తి అయిన సందర్భంగా స్వర్ణోత్సవ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ తమతో పాటు చదువుకొన్న విద్యార్థులందరూ పలు ఉద్యోగాలు చేసి పదవీ విరమణ చేశారన్నారు. అలాగే పాఠశాలలో వారు ఎదుర్కొన్న అనుభవాలను ప్రతి ఒక్కరూ నెమరు వేసుకొన్నారు. వారికి చదువు చెప్పిన వారిలో శివనాగయ్య మాత్రమే ఉండడంతో ఆయన సమావేశానికి హాజరుకావడంతో ఆయనకు ప్రతి ఒక్కరూ పాదాభివందనం చేశారు. ఈ కార్యక్రమానికి దాదాపు 30మంది పూర్వవిద్యార్థులు హాజరయ్యారు. పూర్వ విద్యార్థులు అందరూ సమావేశానికి హాజరు కావడాని ప్రత్యేక కృషి చేసిన విజయ బాస్కర్, నారాయణ, న్నప్పరెడ్డి, మునిశంకరరెడ్డిలకు కృత జ్ఞతలు తెలిపారు. పూర్వ విద్యార్థులు వెంకటరమణ, భాస్కర్, శంకర, నారాయణ, నారప్ప తదితరులు పాల్గొన్నారు.

సరిహద్దు చెక్‌పోస్టులో డీఎస్పీ తనిఖీలు

రామసముద్రం, మార్చి 10: మదనపల్లి డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి మండలంలోని కర్ణాటక సరిహద్దులో ఉన్న కొత్తూరు చెక్‌పోస్టులో తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల దృష్ట్యా అంతర్ రాష్ట్ర చెక్‌పోస్టులలో తనిఖీలు ముమ్మరంగా చేపట్టాలని, అలాగే మద్యం, నగదు, మాదకద్రవ్యాల రవాణా నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం ఆర్.నడింపల్లె పంచాయతీ బలసముద్రం కొండపై వెలసిన వాలీశ్వరస్వామి రథోత్సవం ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చేపట్టి బందోబస్తును డీఎస్పీ పర్యవేక్షణ నిర్వహించారు. ఈ తనిఖీల్లో సీఐ సద్దురుడు, ఎస్ఐ చంద్రశేఖర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

డీఎస్పీకి ఘనంగా సన్మానం



డీఎస్పీని సన్మానిస్తున్న ఏపీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

మదనపల్లె అర్బన్, మార్చి 10: మదనపల్లె ట్రాఫిక్ సీఐగా విధులు నిర్వహించిన శ్రీనివాసులు చౌదరి ఇటీవల డీఎస్పీగా పదోన్నతి పొందారు. ఈ క్రమంలో ఏపీ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సభ్యులు డీఎస్పీ శ్రీనివాసులను ఆదివారం మదనపల్లెలో ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమానికి మదనపల్లె మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ముఖ్యఅతిథిగా హాజరై శ్రీనివాసులు సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఏపీసీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునిగోటిశర్మ, తిమ్మయ్య, గొల్లపుడితిరుపతిరావు, ఎస్‌పి కృష్ణమూర్తి, మునిరత్నం, తదితరులుపాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలి



అరిగెలవారిపల్లెలో పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేస్తున్న జేసీ

గుర్రంకొండ, మార్చి 10:ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకొనేలా పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేయాలని జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ అధికారులకు సూచించారు. గుర్రంకొండ మండలంలోని 43 పోలింగ్ కేంద్రాలను ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో వసతులను తనిఖీ చేశారు. అనంతరం జేసీ మాట్లాడుతూ పోలింగ్ బూత్‌ల్లో ఎన్నికల రోజున పూర్తి స్థాయిలో ఏర్పాట్లు ఉండాలన్నారు. ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛా వాతావరణంలో వేసేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట తహశీల్దార్ శ్రీనాథ్, సెక్టోరియల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ముస్లిం మైనారిటీలకు చంద్రబాబు భరోసా

● రాష్ట్ర శ్రేయస్సు కోసమే బీజేపీతో పొత్తు ● టీడీపీ నేత షాజహాన్‌బాషా



టీడీపీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె టౌన్, మార్చి 10: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న ఎన్ఆర్‌సీ, సీఏఏ బిల్లుల నుంచి ముస్లిం మైనారిటీలకు చంద్రబాబు భరోసా ఇస్తారని మదనపల్లె టీడీపీ నేత, మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో షాజహాన్‌బాషా మాట్లాడుతూ వైసీపీ పాలనలో అప్పుల్లో కూరుకుపోయిన రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే కేంద్ర ప్రభుత్వ సహాయం చాలా అవసరమన్నారు. అందుకే చంద్రబాబునాయుడు, పవన్‌కళ్యాణ్‌తో కలసి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పాటు చేశారన్నారు. వైసీపీ అధ్యక్షుడు జగన్ మోహన్‌రెడ్డి ఆయనపై వున్న 13 ఈడీ కేసుల నుంచి తప్పించుకునేందుకే బీజేపీతో అంటకాగారన్నారు. టీడీపీ కూటమి అధికారంలోకి వస్తేనే రాష్ట్రంలో ముస్లిం మైనారిటీలకు రక్షణ వుంటుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నాదెళ్ల విద్యాసాగర్, కట్టా దొరస్వామినాయుడు, నవీన్‌చౌదరి, షంషీర్, నాదెళ్ల శివన్న, జీవీ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రయోజనాల కోసమే బీజేపీతో పొత్తు

గుర్రంకొండ, మార్చి 10:రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసమే తెలుగుదేశం పార్టీ బీజేపీతో పొత్తు పెట్టుకుందని రాజంపేట పార్లమెంటరీ టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి షేక్.నౌషాద్ అలీ పేర్కొన్నారు. మండలంలోని తరిగొండలో ఆదివారం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ తెలుగుదేశం హయాంలోనే మైనారిటీలకు మంచి జరిగిందని టీడీపీ ప్రవేశపెట్టిన పథకాలను ప్రస్తుత ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. మైనారిటీలంతా కలిసికట్టుగా ఉంటూ టీడీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో అమీన్, జోహర్‌బాష, ఖాదర్‌వలి, హేస్సాన్‌అలి, గౌస్, షాహిర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం



కార్యకర్తలతో మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మద్దిరెడ్డి కొండ్రెడ్డి

తంబళ్లపల్లె, మార్చి 10: రానున్న ఎన్నికల్లో తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ-జనసేన ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎవరున్నా అందరం కలసికట్టుగా గెలుపే లక్ష్యంగా పనిచేద్దామని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మద్దిరెడ్డి కొండ్రెడ్డి అన్నారు. ఆదివారం నియోజకవర్గంలోని ఆరు మండలాల టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలతో తంబళ్లపల్లెలోని కొండ్రెడ్డి స్వగృహంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొండ్రెడ్డిని టీడీపీ సీనియర్ నాయకులు పూలమాలలు, దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు. అనంతరం కొండ్రెడ్డి మాట్లాడుతూ..ఈ అరాచక ప్రభుత్వంలో తనతో పాటు చాలా మంది కార్యకర్తలు అక్రమ కేసులు ఎదుర్కొన్నారని..ఎవ్వరూ భయపడోద్దని తన ప్రాణం ఉన్నంత వరకు ప్రతి కార్యకర్తను కాపాడుకుంటానన్నారు. తంబళ్లపల్లె టికెట్ విషయంలో ఎవ్వరూ అపోహలకు గురి కావద్దని..రెండు, మూడు రోజుల్లో అధిష్టానం దీనిపై స్పష్టత ఇస్తుందన్నారు. అధిష్టానం తీసుకున్న నిర్ణయానికి ప్రతిఒక్కరూ కట్టుబడి ఉండి కుల, మత వర్గ బేధాల్లేకుండా కేడరంతా కలసికట్టుగా పనిచేసి అరాచక పాలనను తరిమికొట్టి తంబళ్లపల్లెలో టీడీపీ-జనసేన జెండా రెపరెపలాడిద్దామన్నారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు ఉత్తమ్‌రెడ్డి, తాతిరెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డి, రఘుపతి, పీర్లమాబు, కొశెట్టివెంకట్రమణ, బోయపల్లె శివ, ఆరు మండలాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉమ్మడి విజయాన్ని ఎవరూ ఆపలేరు



సమావేశంలో మాట్లాడుతున్న జనసేన నేత శ్రీరామ రామాంజనేయులు

మదనపల్లె, మార్చి 10: జనసేన, టీడీపీ, బీజేపీ విజయాన్ని ఇక ఎవరూ ఆపలేరని జనసేన నియోజకవర్గ నేత శ్రీరామ రామాంజనేయులు పేర్కొన్నారు. స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన కార్యకర్తలతో సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకునే మూడు పార్టీలూ కలవాల్సివచ్చిందని, ఇప్పటికే ఆయా అధినేతలు ప్రకటించిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఇదే అంశాన్ని మనం కూడా క్షేత్ర స్థాయిలోని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. జనసేన, టీడీపీ, బీజేపీ మూడు పార్టీ లో..ఏ స్థానంలో ఎవరికి టికెట్ కేటాయించినా..మనమంతా ఐక్యంగా పనియాలని, ముఖ్యంగా ఓటు మార్పిడిపై దృష్టి పెట్టాలన్నారు.

ఆదరించండి.. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేద్దాం



బి. కొత్తకోట ర్యాలీలో జనానికి అభివాదం చేస్తున్న జయచంద్రారెడ్డి

బికొత్తకోట/పెద్దతిప్పసముద్రం. మార్చి10: తంబళ్లపల్లె నియోజకవర్గంలో టీడీపీని ఆదరించండి అభివృద్ధి చేసుకుందామని తంబళ్లపల్లె టీడీపీ అభ్యర్థి దాసరిపల్లె జయచంద్రారెడ్డి వెల్లడించారు. ఆదివారం ఆయన టీడీపీ నాయకులు కార్యకర్తలతో కలసి బూర్లపల్లె గ్రామంలో విస్తృతంగా పర్యటించారు. ముందుగా ఆయన బూర్లపల్లెలోని టీడీపీ సీనియర్ నాయకుడు, మొలకలచెరువు మాజీ మార్కెట్‌కమిటీ చైర్మన్ స్వర్గీయ బూర్లపల్లె కృష్ణారెడ్డి కుమారుడైన శ్రీనివాసులురెడ్డి, కృష్ణారెడ్డి తమ్ముడైన అయ్యవారును కలిసి మాట్లాడారు. బి. కొత్తకోట పట్టణంలో ఆదివారం విజయసంకల్ప యాత్రలో భాగంగా నిర్వహించిన కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో ఆయన వైసీపీపై ఘాటుగా విమర్శించారు. చంద్రబాబు మేనిపెస్టోలో పేర్కొన్న సూపర్‌సిక్స్ పథకాల గురించి జనానికి వివరించాలని కార్యకర్తలను కోరారు. అనంతరం, బీసీ కాలనీ నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ అధ్యక్షుడు సాయినాథ్, నాయకుడు చింతల కిరణ్‌రాయల్, బి కొత్తకోట, ములకలచెరువు, కురబలకోట, తంబళ్లపల్లె మండ లాల టీడీపీ కన్వీనర్లు నారాయణస్వామిరెడ్డి, పాలగిరిసిద్దా, వైజీ సురేంద్ర, రెడ్డెప్ప రెడ్డి, మాజీ జడ్పీటీసీ కువైట్‌శంకర్, నాయకులు కిరణ్, చిటికి శివారెడ్డి, మంత్రి గిరిధర్‌రెడ్డి, మొటుకుశివ, చావిడి కిట్టన్న, చంద్రమోహన్, సంపతికోట కిట్టన్న, గొండిప ల్లిభాస్కర్ రెడ్డి, ప్రభాకర్, గంగాదేవి, తిమ్మరాయుడు, రాఘవరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, బూత్‌కమిటీ, గ్రామకమిటీల అధ్యక్షులు పాల్గొన్నారు.

శంకర్‌ను టీడీపీ అభ్యర్థిగా ప్రకటించండి

కురబలకోట, మార్చి 10: తంబళ్లపల్లె మాజీ ఎమ్మెల్యే శంకర్‌ను టీడీపీ అభ్యర్థిగా ప్రకటించాలని క్లస్టర్ ఇన్‌ఛార్జ్ వైజీ రమణ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని ముదివేడులో శంకర్‌కు మద్దతుగా శాంతియుత నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శంకర్ వెంట మొత్తం క్యాడర్ అంతా నడిచి ఆయనను గెలిపించుకోవడానికి సిద్ధంగా ఉన్నారన్నారని, టీడీపీ అధినేత చంద్రబాబు మరొకసారి ఆలోచించి శంకర్‌ను అభ్యర్థిగా ప్రకటించాలని కోరారు. అనంతరం శంకర్ యాదవ్ కావాలని నినాదాలు చేశారు.

శివమాల భక్తులు శ్రీశైలం పయనం

కలకడ, మార్చి 10:కలకడ మండలానికి చెందిన శివమాల భక్తులు శ్రీశైలంలో కొలువైన మల్లికార్జునస్వామిని దర్శించుకొనేందుకు ఆదివారం ఉదయం బయలుదేరారు. గురుస్వామి వై.శ్రీనివాసులు ఆధ్వర్యంలో 41 రోజుల దీక్షలో ఉన్నవారు. ఝరిలో స్నానాలు చేసి శైకత లింగానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఇరుముడులు ధరించి 40 మంది భక్తులు బయలుదేరారు. గత 25 సంవత్సరాలుగా మల్లికార్జున దర్శనానికి వెళుతున్నారు. కాగా శ్రీశైలానికి బయలుదేరిన భక్తుల్లో ఎం.తిప్పారెడ్డి, రెడ్డెప్ప, రెడ్డిశేఖర్, మోహన్‌బాబు, ఉదయ్‌కుమార్, నాగార్జున, హరిప్రసాద్, నాగరాజ, రెడ్డిమోహన్ తదితరులు ఉన్నారు.